

పరిశ్రమల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన



చంద్రబాబుకు రాఖీ కడుతున్న మంత్రి అనిత



పరిశ్రమల నమూనాల తిలకింత



పరిశ్రమలకు ప్రారంభోత్సవం

అత్యుత్తమ ఆర్థిక మండలిగా శ్రీసిటీ

- తక్కువ వ్యయంతో ఉత్పత్తులు సాధించేందుకు కేంద్రం కావాలని ఆకాంక్షించిన సీఎం చంద్రబాబు
- 15 పరిశ్రమల ప్రారంభం... 7 యూనిట్లకు భూమిపూజ.... మరో ఐదింటి స్థాపనకు ఎంవోయూలు





శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల సీఈవోల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

తిరుపతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై, కృష్ణపట్నం, తిరుపతి ప్రాంతాలకు చేరువగా వున్న శ్రీసిటీని అత్యుత్తమ ఆర్థిక మండలిగా తీర్చిదిద్దాలన్న ఆలోచన వుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. దానికి అనుగుణంగా శ్రీసిటీ ఐజీబీసీ గోల్డెన్ రేటింగ్ గుర్తింపు సాధించేలా కృషి చేస్తున్నామన్నారు. సోమవారం మధ్యాహ్నం శ్రీసిటీలో పర్యటించిన ఆయన సుమారు 30 ప్రతిష్ఠాత్మక పరిశ్రమలు, కంపెనీలకు చెందిన సీఈవోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఇప్పటికే శ్రీసిటీలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు వున్నాయని, వాటిని మరింతగా మెరుగుపరిచి అత్యంత అనుకూల నివాసయోగ్య ప్రాంతంగా మారుస్తామని ప్రకటించారు. పచ్చదనం కోసం వందశాతం వర్షపునీటి సంరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. వీలైన మేరకు ఉత్పత్తి, రవాణా ధరలు తగ్గించాల్సి వుందని, ఆ దిశగా తమ ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా 30 దేశాలు పరిశ్రమలు ఏర్పాటు చేసి వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్న శ్రీసిటీ తక్కువ వ్యయంతో ఉత్పత్తులు సాధించేందుకు కేంద్రం కావాలని ఆకాంక్షించారు. శ్రీసిటీలో పారిశ్రామికవేత్తలు ఉపాధిని, సంపదను సృష్టిస్తున్నారని కొనియాడారు. పరిశ్రమల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని, అదే విధంగా అవి సృష్టించే సంపద సంక్షేమానికి, సాధికారతకు దోహదపడుతుందన్నారు.



అగ్నిమాపక కేంద్రానికి ప్రారంభోత్సవం

పలు పరిశ్రమలకు ప్రారంభోత్సవాలు, భూమిపూజ

శ్రీసిటీలో సీఎం చంద్రబాబు సోమవారం పలు పరిశ్రమలను ప్రారంభించగా మరికొన్నింటికి భూమి పూజ చేశారు. అలాగే కొన్ని పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలపై సంతకాలు చేశారు. రూ. 1570 కోట్ల పెట్టుబడులతో 8,480 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా ఏర్పాటైన 15 పరిశ్రమలను సీఎం ప్రారంభించారు. అలాగే రూ. 900 కోట్ల పెట్టుబడులతో 2,740 మందికి ఉపాధినిచ్చే ఏడు పరిశ్రమల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అదే విధంగా రూ. 1213 కోట్ల పెట్టుబడులతో 4,060 మందికి ఉపాధి కల్పించే ఐదు పరిశ్రమల స్థాపనకు సంబంధిత సంస్థల ప్రతినిధులతో ఎంఓయూలపై సంతకాలు చేశారు. వీటితో పాటు శ్రీసిటీలో నూతనంగా నిర్మించిన ఫైర్ స్టేషన్‌ను ప్రారంభించిన చంద్రబాబు హైటెక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకు మునుపు చంద్రబాబు విమానంలో రేణిగుంటలోని విమానాశ్రయానికి నిర్ణీత సమయం కంటే అరగంట ఆలస్యంగా 12.10గంటలకు చేరుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. అక్కడి నుంచీ హెలికాప్టర్‌లో బయల్దేరి శ్రీసిటీకి 12.40గంటలకు చేరుకున్నారు. హెలిపాడ్ వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీసిటీ ఛైర్మన్ శ్రీనిరాజు, ఎండీ రవీంద్రసన్నారెడ్డి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అక్కడ నుండి బిజినెస్ సెంటర్‌కు చేరుకున్న సీఎంకు పూర్ణకుంభం, మేళతాళాలతో ఆహ్వానం పలికారు. పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఇండస్ట్రీస్ డైరెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త కిషోర్, డీఐజీ షిమోషీ బాజ్‌పాయ్, ఎస్పీ సుబ్బారాయుడు, ఎమ్మెల్యేలు ఆదిమూలం, ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు హేమలత, నెలవల సుబ్రమణ్యం, పరసా రత్నం, వరప్రసాద్, ఎస్సీవీ నాయుడు తదితరులు స్వాగతం పలికారు. శ్రీసిటీలో కార్యక్రమాలు ముగించుకుని 2.40గంటలకు హెలికాప్టర్‌లో నెల్లూరు జిల్లా సోమశిల ప్రాజెక్టు సందర్శనకు చంద్రబాబు బయల్దేరి వెళ్ళారు. అక్కడినుంచి సాయంత్రం 6.20గంటలకు రేణిగుంటకు చేరుకున్న చంద్రబాబు విజయవాడకు తిరుగుపయనమయ్యారు.



శ్రీసిటీ ప్రగతి చిత్రాల ప్రదర్శన

చంద్రబాబు తొలి పర్యటనతోనే జిల్లాకు భారీ ప్రయోజనాలు

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశాక కుటుంబంతో కలసి నేరుగా తిరుమల వచ్చి శ్రీవారిని దర్శించుకుని వెళ్ళారు. ముఖ్యమంత్రిగా అధికారికంగా సోమవారం జిల్లాకు తొలి పర్యటన జరిపారు. అయితే తొలి పర్యటనతోనే ఆయన జిల్లాకు భారీగా ప్రయోజనాలు కల్పించి వెళ్ళడం విశేషం. నిర్మాణం పూర్తయి ఉత్పత్తి ప్రారంభించేందుకు సంసిద్ధమైన 15 పరిశ్రమలను చంద్రబాబు ప్రారంభించారు. ఈ పరిశ్రమల మొత్తం పెట్టుబడులు రూ. 1570 కోట్లు కాగా వీటి వల్ల ఏకంగా 8040 మంది యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. ఇందులో సింహభాగం జిల్లాకు చెందిన యువతే లబ్ధి పొందుతుండడం గమనార్హం. అలాగే 7 పరిశ్రమల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. వీటి పెట్టుబడుల విలువ రూ. 900 కోట్లు కాగా వీటి ద్వారా 2740 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఇదే వేదికగా రూ. 1213 కోట్ల పెట్టుబడుల అంచనాతో ముందుకొచ్చిన ఐదు పరిశ్రమలకు చెందిన ప్రతినిధులతో చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒప్పందాలు కుదుర్చుకుని వాటిపై సంతకాలు చేశారు. ఈ పరిశ్రమలు ఏర్పాటైతే వీటి వల్ల 4060 మందికి ఉద్యోగాలు రానున్నాయి. మొత్తంమీద చంద్రబాబు శ్రీసిటీలో గడిపిన రెండున్నర గంటల వ్యవధిలో జిల్లాకు రూ. 3683 కోట్ల పెట్టుబడులు రావడానికి, తద్వారా 15280 ఉద్యోగాల కల్పనకు కార్యరంగం సిద్ధమైంది. ఈ పరిణామం కూటమి పార్టీల శ్రేణులతో పాటు జిల్లా ప్రజలకు ప్రత్యేకించి నిరుద్యోగ యువతకు సంబరం కలిగిస్తోంది. గత ఐదేళ్ళలో పరిశ్రమలకు ముఖం వాచిన జిల్లా ఇపుడు చంద్రబాబు సీఎం అయిన కేవలం 70 రోజులకే ఇంత భారీ ఎత్తున జిల్లాకు ప్రయోజనాలు కల్పించడం ప్రజల్లో ఆశలు రేకెత్తించింది. కాగా సీఎం శ్రీసిటీ పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ నుంచి జాతీయ రహదారి వరకు పోలీసు ఆంక్షలు అమలయ్యాయి. భారీ బందోబస్తుతో దారిలో వెళ్లే ప్రజలను సైతం అడ్డుకున్నారు. చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు తెలుగు తమ్ముళ్ల పెద్దఎత్తున హెలిప్యాడ్ వద్దకు వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని మండలాల నాయకులు తడకు తరలివచ్చారు. అయితే వారిని హెలిప్యాడ్ పరిసరాలకు సైతం అనుమతించలేదు.

కూలిన చోటే.. కొత్త చిగురు..!

తుపాను ధాటికి కూలిన ఊడల మర్రి



ఎస్వీయూలో దశాబ్దాల నాటి ఊడల మర్రి కథ ఇదీ



కొత్త చిగురు వేసిన చిత్రం

కూలిన చోటే.. కొత్త చిగురు వేసిన ఓ ఊడల మర్రి కథ ఇది. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రకాశం భవన్ వద్ద ఏపుగా పెరిగి ఎన్నో పశుపక్ష్యాదులకు నెలవుగా నిలిచిన సుమారు యాభై ఏళ్ళ నాటి మర్రి చెట్టు 2023 డిసెంబరు 4వ తేదీ 110 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు (మిచౌంగ్ తుపాన్) కూలి పోయింది. రోడ్డుకు అడ్డంగా ఉండడంతో మర్రిచెట్టుకు పైనున్న అన్ని కొమ్మలను నరికి వేసి కాండం మాత్రం వదిలి పెట్టారు. ప్రకాశం భవన్‌కు ఆనుకొని ఉన్న టెన్నిస్, వాలీబాల్ కోర్టులకు ఎదురుగా ఉన్న ఈ మర్రిచెట్టు కూలడంతో యూనివర్సిటీ ఇంజనీరింగ్ సిబ్బంది ఆవేదన చెందారు. ఈ మర్రిచెట్టును ఎలాగైనా మళ్ళీ నిలబెట్టాలన్న ఆలోచనతో వేర్లన్నింటినీ పూడ్చి భారీ కాండం గల మర్రి చెట్టును కొంత కాలం క్రితం నిలబెట్టారు. ఈ క్రమంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు మర్రి చెట్టు కొత్త చిగురు వేసింది. మన దేశ జాతీయ వృక్షంగా ఉన్న మర్రి చెట్టు కొత్త చిగురు వేయడానికి కారణమైన ఇంజనీరింగ్ సిబ్బంది, యూనివర్సిటీ అధికారుల చొరవ పట్ల అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రయత్నం ద్వారా ప్రకృతి సోయగాన్ని మరింతగా పెంపొందించి అందరికీ ఆహ్లాదాన్ని పంచినట్టయ్యిందని కితాబు ఇచ్చారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు)



స్విమ్స్‌లో జూడాల ప్రదర్శన

ప్రాణం పోసే వారి ప్రాణాలే తీస్తారా..?

- స్విమ్స్, రుయాస్పత్రుల్లో ఆగని నిరసనలు



రుయాస్పత్రి వద్ద నిరసన

తిరుపతి(వైద్యం), ఆగస్టు 19 : ప్రాణాలు పోసే డాక్టర్ల ప్రాణాలు అమానుషంగా తీస్తున్నా పట్టించుకునే వారు లేకపోవడం సరికాదని స్విమ్స్, రుయాస్పత్రిలోని జూనియర్ డాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో మహిళా డాక్టరుపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ వారు చేస్తున్న న్యాయ పోరాటం సోమవారం కూడా కొనసాగింది. ఈ క్రమంలో వారు ప్రభుత్వాల నిర్లక్ష్యం, సమాజంలో డాక్టర్ల ప్రాధాన్యత, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు.. నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరిస్తూ స్విమ్స్‌లో పలు నాటక ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం హత్యాచారానికి కారకులను కఠినంగా శిక్షించి, జూనియర్ డాక్టరు కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జూడాలకు పలువురు సీనియర్ డాక్టర్లు మద్దతు తెలిపారు.



తిరుపతి విమానాశ్రయంలో సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు - వీడ్కోలు పలుకుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ నాయకులు సుగుణమ్మ, నరసింహ యాదవ్ తదితరులు

వైభవంగా కల్యాణ వెంకన్న గరుడోత్సవం



చంద్రగిరి, ఆగస్టు 19: శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కట్ల కైంకర్యాలు పూర్తిచేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి ఆయనకు అత్యంత ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై అధిష్ఠింపజేసి, మాడవీధుల్లో ఊరేగించారు. స్పెషల్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణచార్యులు, పార్థసారిథి, జమేదార్ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

నవజీవన్ ఆశ్రమంలో ఫొటోగ్రఫీ దినోత్సవం



తిరుచానూరు, ఆగస్టు 19: తిరుచానూరు సమీపంలోని నవజీవన్ ఆశ్రమంలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. తిరుపతి ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వృద్ధులు, అంధులు, వికలాంగుల మధ్య కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. అధ్యక్షుడు ఎం.రాంబాబు, ఆదిశేషయ్యనాయుడు, పురుషోత్తంరాజు, గురుమూర్తి, ప్రవీణ్‌కుమార్, శంకర్, నాగేంద్రకుమార్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్, తులసి, మునిరామ్, శంకర్, మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణి డ్యామ్ పీటీసీ ప్రిన్సిపాల్‌గా సుబ్రహ్మణ్యం



చంద్రగిరి, ఆగస్టు 19: చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని కళ్యాణి డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ కళాశాల (పీటీసీ) ప్రిన్సిపాల్‌గా కె.సుబ్రహ్మణ్యం సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తుండిన రాధాకృష్ణ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో సుబ్రహ్మణ్యం వచ్చారు. 1991వ బ్యాచ్‌కు చెందిన ఈయన వైజాగ్ అదనపు డీసీపీగా, ఏపీ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా, గతంలో సీఎం చంద్రబాబుకు వ్యక్తిగత భద్రతాధికారిగా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించాక మీడియాతో మాట్లాడుతూ.. కళాశాలను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. కళాశాల అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

భారతీయ సంస్కృతికి వైఖానస ఆగమమే ప్రమాణం

విఖనస మహర్షి జయంతి సభలో పండితులు



తిరుమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతికి వైఖానస ఆగమ శాస్త్రమే ప్రమాణమని విఖనస మహర్షి జయంతి సభలో పండితులు ఉద్ఘాటించారు. తిరుమలలో సోమవారం విఖనస మహర్షి జయంతిని పురస్కరించుకుని ఆస్థాన మండపంలో టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్, వైఖానస దివ్యా సిద్ధాన్తవర్ధిని సభ సంయుక్త ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సభ కార్యదర్శి శ్రీనివాస దీక్షితులు ప్రసంగిస్తూ.. ఆగమాలలో అతి ప్రాచీనమైనది వైఖానస ఆగమమని చెప్పారు. కోశాధికారి సనత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వైఖానస గ్రంథాల అధ్యయనం చేసి.. జ్ఞాన మార్గాలను అనుష్ఠించి వైదిక మార్గంలో నడవాల్సిన అవసరం ఉందన్నారు. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం పండితులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విఖనసాచార్యుల సన్నిధికి మలయప్పస్వామి

గాయత్రి జపాన్ని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి మంగళవారం సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం ఉత్తర మాడవీధిలోని విఖనసాచార్యుల సన్నిధికి వేంచేపు చేయనున్నారు. విఖనస మహర్షి జయంతి మరుసటి రోజు స్వామి, అమ్మవార్లు విఖనసాచార్యుల సన్నిధికి వేంచేపు చేయడం ఆనవాయితీ. ఈసందర్భంగా అక్కడ ఆస్థానం నిర్వహించి నివేదన చేపడతారు.

ముగిసిన సంస్కృత వారోత్సవాలు




మాట్లాడుతున్న వేదవర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి

తిరుపతి రూరల్, ఆగస్టు 19: జాతీయసంస్కృత వర్సిటీలో నిర్వహించిన సంస్కృత వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్వీ వేదవర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి మాట్లాడుతూ.. సంస్కృతభాషాభివృద్ధికి, భారతీయ సంస్కృతి రక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని ఆకాంక్షించారు. విజయనగరానికి చెందిన ఎన్‌సీఎస్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎన్.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అన్ని భాషల్లో ప్రచురితమైన రామాయణ గ్రంథాలను సేకరించి సంస్కృత భాషాభివృద్ధికి కృషి చేస్తున్నామని వివరించారు. బెంగళూరుకి చెందిన ఎడ్యుయాక్ట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ప్రతినిధి శ్రీరామ చక్రధర్ మాట్లాడుతూ.. సంస్కృతాన్ని ఆధునిక పద్ధతుల్లో ప్రజలకు చేరువచేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సంస్కృత భాషను సామాన్య ప్రజలకు చేరువచేసేందుకు వర్సిటీలో ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. వివిధ పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులు భరత్‌కుమార్, తేజ్‌కుమార్, అవదేశ్ శర్మ, ప్రసన్న, వసుధా తదితరులకు పురస్కారాలు అందజేశారు. అకడమిక్ డీన్ రజనీకాంత్‌శుక్లా, వాగ్వర్ధినీ పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ నాగరాజు, అడిషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయన హెగ్డే, డాక్టర్ భరత్‌భూషణ రథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపకర్మ ఉత్సవం

శ్రావణ పూర్ణిమని పురస్కరించుకుని వేదభాష్య విభాగ ఆధ్వర్యంలో సోమవారం ఉపకర్మ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వర్సిటీలోని నైమిశారణ్య మండపంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, వేదభాష్య విభాగ హెడ్ డాక్టర్ నిరంజనమిశ్రా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో ఓరియెంటేషన్ డే



తిరుపతి రూరల్, ఆగస్టు 19: కరకంబాడి రోడ్డులోని ఎస్వీకాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (ఎస్వీసీఈ)లో 2024-25లో బీటెక్ లేటరల్ ఎంట్రీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సోమవారం ఓరియెంటేషన్ డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ తారకేశ్వర్, ఇంజనీరింగ్ సైన్సెస్ డీన్ ఆజాద్, డాక్టర్ ప్రేమ్ కుమార్, అకడమిక్ డీన్ ఈశ్వర్‌రెడ్డి, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూరల్ తహసీల్దార్ బాధ్యతల స్వీకారం



రామాంజులు నాయక్

తిరుపతి రూరల్, ఆగస్టు 19: తిరుపతి రూరల్ మండల నూతన తహసీల్దార్‌గా బి.రామాంజులునాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు చిత్తూరు ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న ఈయన ఎన్నికల విధుల్లో భాగంగా నంద్యాలలో పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా రూరల్ తహసీల్దార్‌గా నియమితులయ్యారు.

సహకార సంఘంలో రైతులు కేవైసీ చేసుకోండి

తిరుపతిరూరల్, ఆగస్టు 19: మల్లంగుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులు ఆధార్, ఫోన్‌నెంబరుతో తప్పనిసరిగా కేవైసీ చేసుకోవాలని పర్సన్ ఇన్‌చార్జి జీఆర్ పవనకుమారి, మేనేజర్ పుష్పలత తెలిపారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. సహకార సంఘ ఎన్నికల్లో తమ ఓటుహక్కు కొనసాగించుకునేందుకు కేవైసీని తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. సభ్యత్వం ఉన్న రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఫొటోలను ఈనెల 30వ తేదీ లోపు సంఘకార్యాలయంలో అందించాలని సూచించారు. కేవైసీ చేసుకోకుంటే ఓటు హక్కు ఉండదని చెప్పారు.

మృగాళ్లకు ఉరే సరి

తిరుచానూరు, ఆగస్టు 19: మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు చేస్తున్న మృగాళ్లకు ఉరే సరి అని సాయినగర్ పంచాయతీ సర్పంచ్ డీవీ రమణ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, ప్రజాస్వామ్యవాదులు, ఉద్యోగ వర్గాలు, విద్యార్థులు సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. బాబూ జగ్జీవన్‌రావ్ పార్కు సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించి, దిష్టిబొమ్మను దహనం చేశారు. డీవీ రమణ మాట్లాడుతూ.. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారం సభ్య సమాజం తల దించుకునేలా ఉందన్నారు. దీనికి కారకులు ఎంతటి వారైనా బహిరంగంగా ఉరి వేయాలన్నారు. బాబా విద్యానికేతన్ సంస్థ అధినేత రమేష్‌నాయుడు, నారాయణ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వాసు, అవిలాల సర్పంచ్ వెంకటరమణ, లింగేశ్వర్‌నగర్ సర్పంచ్ కోటేశ్వరరావు, ఓటేరు సర్పంచ్ రాజా, మాజీ ఎంపీటీసీ రెడ్డివాణి తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మకు ఉరివేస్తున్న సర్పంచ్ డీవీ రమణ



చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద ఉపాధ్యాయుల నిరసన - కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న భావన చిన్నతంబు

మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

చంద్రగిరి: మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని 2023 మిస్ ఇండియా ఐకాన్ దివా విన్నర్, మిత్ర ఫౌండేషన్ అధ్యక్షురాలు భావన చిన్నతంబు అన్నారు. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ సోమవారం సాయంత్రం మహిళలతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తెలుగు మహిళ నాయకురాలు వడ్లమూడి రాధ, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కొవ్వొత్తులతో చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై కఠిన శిక్షణ పడేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

డీవైఎఫ్ఐ, జేవీవీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

జూనియర్ డాక్టరుపై జరిగిన హత్యాచారానికి సంఘీభావంగా డీవైఎఫ్ఐ, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం చెన్నారెడ్డికాలనీ నుంచి ఎస్వీ వైద్య కళాశాల సర్కిల్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘాల నేతలు రవి, సాయిలక్ష్మి మాట్లాడుతూ.. నిందితులతో పాటు పరోక్షంగా కారకులైన ప్రతీ ఒక్కరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ఎస్వీయూలో ఫ్లాష్ మాబ్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు): కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ ఎస్వీయూలో విద్యార్థినులు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. వీరికి రిజిస్ట్రార్ భూపతి నాయుడు సంఘీభావాన్ని తెలియచేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, బీజేవైఎం నేత కల్లూరు విష్ణువర్ధన్‌రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ నేతలు రామ్మోహన్, అశోక్, వైద్య, ఇంజినీరింగ్ విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రధాని ఆవిష్కరించిన 'కోణార్క్' వేరుశనగ రకం

ప్రాణం పోసుకుంది తిరుపతి ఆర్ఏఆర్ఎస్‌లో

- ఏడీఆర్ సుమతి వెల్లడి



శాస్త్రవేత్తలతో కలసి కోణార్క్ వేరుశనగ రకాన్ని ప్రదర్శిస్తున్న ఏడీఆర్ డాక్టర్ సుమతి

తిరుపతి రూరల్, ఆగస్టు 19: 'దేశ ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 11వ తేదీన న్యూఢిల్లీలోని అఖిల భారత వ్యవసాయసంస్థలో విడుదల చేసిన 109 రకాల కొత్త వంగడాల్లో కోణార్క్ (టీసీజీఎస్-1707)రకం తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్)లో ప్రాణం పోసుకుంది. ఇందులో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌పీ వాసంతి నేతృత్వంలో మొక్కల ప్రజనన విభాగ (ప్లాంట్ బ్రీడింగ్) శాస్త్రవేత్తలు జాన్, శ్రీవిద్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, అమరావతి కీలకపాత్ర పోషించారు. 2013లో ఈ పరిశోధన చేపట్టగా, ఈ ఏడాదిలో కొత్తరకం వంగడం సిద్ధమైంది' అని సోమవారం ఆర్ఏఆర్ఎస్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో శాస్త్రవేత్తలతో కలిసి ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి వెల్లడించారు. ఇటీవల వివిధ వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన రకాలను డెవలప్‌చేసి విడుదల చేశామని వివరించారు. 2022లో విశిష్ట(టీసీజీఎస్-1694), 2023లో హిమనీ(టీసీజీఎస్-1522) రకాలను విడుదల చేయగా.. 2024లో కొత్తవంగడం కోణార్క్(టీసీజీఎస్-1707)ని ప్రధాని నరేంద్రమోదీ విడుదల చేశారని తెలిపారు. శాస్త్రవేత్తలు మురళీకృష్ణ, ప్రతిమ, కదిరిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కోణార్క్(టీసీజీఎస్-1707) ప్రత్యేకతలు

మనదేశంలో ఒడిశా, వెస్ట్‌బెంగాల్ రాష్ట్రాల్లో ఖరీఫ్ సీజన్లో సాగు చేసేందుకు అనువైన రకం. ఇది చిన్న గుత్తిరకం. పంటకాలం 105-110రోజులు. హెక్టారుకు 25క్వింటాళ్ల వరకు దిగుబడి. కాయనుంచి పప్పు దిగుబడి 70-75శాతం ఉంటుంది. నూనె 49శాతం వరకు ఉంటుంది. రసం పీల్చే పురుగులను తట్టుకుంటుంది. ఆకుమచ్చ తెగులు, వేరుకుళ్లు, కాండం కుళ్లు, వేరుఎండు తెగుళ్లని మధ్యస్థంగా తట్టుకుంటుంది. అధిక నీటి వినియోగ సామర్థ్య రకం. గింజలు గులాబీ రంగులో ఉండి కాయలన్నీ ఒకేసారి పక్వానికి వస్తాయి. గింజల్లో నిద్రావస్థ రెండువారాలు వరకు ఉంటుంది. కాగా తల్లిగా (జీపీబీడీ-4)ని, తండ్రిగా ఐసీజీ(ఎఫ్‌డీఆర్ఎస్)79ని సంకరం ద్వారా దీన్ని వృద్ధి చేశారు.

ఘనంగా రాఖీ వేడుకలు



తిరుపతి(వైద్యం), ఆగస్టు 19: రాఖీ పండుగ సందర్భంగా స్విమ్స్ ఆసుపత్రిలో రాఖీ వేడుకలను వైద్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా డాక్టర్లు వారి సీనియర్ డాక్టర్లకు, వైద్య విభాగాధిపతులకు రాఖీలు కట్టి మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. మహిళా డాక్టర్లపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టి తమకు అండగా నిలవాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 19: ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీ ఈఈఈ విభాగ పరిశోధకుడు బిరుదాల వెంకటేష్‌రెడ్డి డాక్టరేట్ పొందారు. డిజైన్ అండ్ ఆప్టిమైజేషన్ ఆఫ్ రెన్యువబుల్ ఎనర్జీ బేస్డ్ ఎలక్ట్రిక్ వెహికిల్ ఛార్జింగ్ స్టేషన్ అంశంపై ప్రొఫెసర్ సీహెచ్ చెంగయ్య పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

మొదలైన బదిలీల ప్రక్రియ



- చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య కలెక్టర్లతో కమిటీ
- ఐదేళ్లు దాటితే ఉన్నచోటు నుంచి కదలాల్సిందే
- 15 శాఖల్లో బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా
- నెలాఖరులోగా ప్రక్రియ పూర్తికి కసరత్తు
- సిఫార్సుల కోసం ఎమ్మెల్యేల వద్ద క్యూ కడుతున్న ఉద్యోగులు

చిత్తూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన రెండు నెలలకు బదిలీలకు పచ్చ జెండా ఊపింది. ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు కొన్నిచోట్ల డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, తహసీల్దార్, ఎంపీడీవోల్ని బదిలీ చేసింది. ఈ క్రమంలో అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మిగిలిన ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం సిద్ధమైంది. తాజాగా బదిలీల మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నెలాఖరు వరకు బదిలీలపై నిషేధాన్ని తొలగించడంతో సోమవారం నుంచే సందడి మొదలైంది. 15 శాఖల్లో అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరగనున్నాయి. ఇప్పటికే వీఆర్వో, ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్ల కొన్ని బదిలీల దరఖాస్తులు కలెక్టరేట్‌కు అందాయి.

ఈ శాఖల్లోనే బదిలీలు..

అన్ని శాఖల ఉద్యోగులందర్నీ బదిలీ చేయకుండా కేవలం ప్రజాసంబంధ వ్యవహారాలకు సంబంధించిన శాఖల్లోనే బదిలీలకు కూటమి ప్రభుత్వం ఎంచుకుంది. ప్రత్యేకించి పోలీసు, రెవెన్యూ, కమర్షియల్ ట్యాక్స్, పంచాయతీరాజ్, ఎక్సైజ్, అన్ని ఇంజనీరింగ్ విభాగాల్లో కలిపి మొత్తంగా 15 శాఖల్లో మాత్రమే బదిలీలు చేయాలని నిర్ణయించారు. ఆయా శాఖల్లో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేసి చాలా కాలమైంది. కొందరైతే తమకు నచ్చిన స్థానాల్లోనే ఒకేచోట ఏళ్లుగా పాతుకుపోయారు. ఇష్టానుసారంగా అవినీతికి పాల్పడ్డారు. మరికొందరు తమకు నచ్చిన పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చారు.

ముగ్గురు కలెక్టర్లతో కమిటీ

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలను చేపట్టేందుకు మూడు జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు సుమిత్‌కుమార్, వెంకటేశ్వర్, శ్రీధర్‌తో పాటు ఆయా జిల్లా డీఆర్వోలు కూడా ఈ కమిటీలో ఉంటారు. ఈ నెల 27, 28 తేదీల్లో ముగ్గురు కలెక్టర్లు నేరుగా, లేదా ఆన్‌లైన్ ద్వారా సమావేశమై దరఖాస్తుల్ని పరిశీలిస్తారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నెలాఖరులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు చిత్తూరు ఉమ్మడి జిల్లాలో జేసీలుగా పనిచేయడంతో ఓ అవగాహనతో బదిలీల వేగవంతానికి కృషి చేసే అవకాశముంది.

సచివాలయ ఉద్యోగుల పరిస్థితేంటి?

ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగుల్ని తప్పనిసరి బదిలీ చేయాలంటూ ప్రభుత్వం మార్గదర్శకాల్లో ఉంది. సచివాలయ వ్యవస్థ ప్రారంభమై ఇంకా ఐదేళ్లు పూర్తి కాలేదు. 2019 అక్టోబరు 2వ తేదీ నుంచి సచివాలయ వ్యవస్థ ప్రారంభించారు. సుమారు మూడు నెలల పాటు తొలి విడత ఉద్యోగుల్ని నియమించుకున్నారు. 2020 చివర్లో రెండో విడత ఉద్యోగుల భర్తీ చేశారు. కానీ, ఈ ఉద్యోగుల్లో కూడా నిజమైన అవసరమున్నవారు ఉన్నారు. అలాంటి వారిని కలెక్టర్లు ప్రత్యేకంగా భావించి బదిలీల్లో అవకాశం కల్పించాల్సి ఉంది.

సమస్యలుంటే నేరుగా చెప్పుకోవచ్చు



సిఫార్సు ఉంటేనే బదిలీలు చేస్తారని భావించకండి. నిజమైన సమస్య ఉంటే నేరుగా కలిసి దరఖాస్తు చేసుకోండి. పరిశీలించి బదిలీలకు అవకాశం కల్పిస్తాం. లాంగ్ స్టాండింగ్, కుటుంబ, ఆరోగ్య సమస్యలున్నవారికి బదిలీల్లో ప్రాధాన్యమిస్తున్నాం. సచివాలయ ఉద్యోగులకు ఐదేళ్లు పూర్తి కాలేదు. దీంతో మ్యూచువల్, కుటుంబ సమస్యలున్నవారినే బదిలీ చేయనున్నాం. అవకాశాన్ని బట్టి ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల్ని పరిగణనలోకి తీసుకుంటాం.

- సుమిత్‌కుమార్, చిత్తూరు కలెక్టర్

ఎమ్మెల్యేల సిఫార్సు తప్పనిసరంటూ ప్రచారం

వైసీపీ హయాంలో తహసీల్దార్, ఎంపీడీవో, సీఐ, ఎస్ఐ వంటి స్థాయి అధికారుల్ని స్థానిక ఎమ్మెల్యేలు వద్దనుకుంటే క్షణాల్లో బదిలీ చేసేవారు. అవసరమైన వారిని తెచ్చుకునేవారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు ఆ పరిస్థితి లేదు. అడిగిన తహసీల్దార్, సీఐ, ఎస్ఐలను ఇవ్వడం లేదని జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. తాజాగా బదిలీల జీవో రావడంతో.. ఎమ్మెల్యేల సిఫార్సు తప్పనిసరనే ప్రచారం ప్రారంభమైంది. దీంతో ఆయా శాఖల్లో అధికారులు, ఉద్యోగులు ఎవరి స్థాయిలో వారు సిఫార్సు లేఖల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. ద్వితీయ శ్రేణి నాయకుల్ని పట్టుకుని ఎమ్మెల్యేలను కలుస్తున్నారు.

వైసీపీతో అంటకాగినవారి జాబితా సిద్ధం

గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులతో అంటకాగి, వారి అక్రమాలకు సహకరించిన అధికారులు, ఉద్యోగుల జాబితాలను టీడీపీ నేతలు సిద్ధం చేశారు. బదిలీల్లో వారికి ప్రాధాన్యం లేకుండా చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. వైసీపీతో అంటకాగిన చాలామంది పోలీసు అధికారులకు ఇప్పటికే పోస్టింగ్ ఇవ్వలేదు. వారిలో అప్పటి ఎస్పీ రిషాంత్‌రెడ్డి, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ గంగిరెడ్డి సహా ఓ స్థాయిలో వైసీపీ కోసం పనిచేసిన డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు ఉన్నారు. కొందర్ని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోమని ఉత్తర్వులు ఇవ్వగా.. మరికొందర్ని వీఆర్‌కు పంపించారు.

కన్నుల పండువగా గరుడ సేవ



శ్రావణ పౌర్ణమి గరుడసేవ తిరుమలలో సోమవారం కన్నులపండువగా జరిగింది.రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల మధ్య సర్వాలంకార భూషితుడైన మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడుడిపై కొలువుదీరి నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. చల్లటి వాతావరణంలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు నడుమ గరుడవాహన సేవ వైభవంగా జరిగింది. శ్రావణపౌర్ణమి కావడంతో భక్తులు భారీగా గ్యాలరీల్లోకి చేరి వాహనసేవలను వీక్షించారు. కర్పూర హారతులతో గోవిందనామస్మరణలు చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 101 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న అధికారులు

తిరుపతి(విద్య), ఆగస్టు 19: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు మొత్తం 101 అర్జీలు అందాయి. డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, దేవేంద్ర రెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను అధికారులకు రాతపూర్వకంగా తెలియజేసి పరిష్కరించాలని అభ్యర్థించారు. వచ్చిన అర్జీల్లో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించి 67 ఉండగా, పోలీసుశాఖకు మూడు, ఇతర శాఖలకు సంబంధించి 31 ఉన్నాయి. నిర్దేశిత సమయంలోగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కలెక్టర్లు తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో..



బాధితుడితో మాట్లాడుతున్న ఏఎస్పీ వెంకట్రావు

తిరుపతి(నేరవిభాగం): ఎస్పీ కార్యాలయంలో సోమవారం అదనపు ఎస్పీ వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 50 అర్జీలు అందాయి.ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిలో దొరికిపోతామనే ఫైళ్లు కాల్చేస్తున్నారు!

జనసేన నేత కిరణ్‌రాయల్



తిరుమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో చేసిన అవినీతిలో దొరికిపోతామన్న భయంతో ఫైళ్లు కాల్చేస్తున్నారని జనసేన తిరుపతి ఇన్‌చార్జ్ కిరణ్ రాయల్ ఆరోపించారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'ఫైళ్లు కాలిపోవడం ఇప్పుడు రాష్ట్రంలో ట్రెండింగ్‌గా మారింది. మదనపల్లెలో కాలిపోయినట్టే టీటీడీ ఏడీ బిల్డింగ్‌లోనూ ఫైళ్లు కాలిపోవడం బాధాకరం. చాలా ముఖ్యమైన ఫైళ్లు కాలిపోయినట్టు సమాచారముంది. శ్రీవాణి ట్రస్టుకు సంబంధించిన రూ.350 కోట్లతో ఆలయాలు నిర్మాణం చేశామని చెప్తున్నప్పటికీ వివరాలు బయటపెట్టమంటే ఇంతవరకు వెల్లడించలేదు. దానికి సంబంధించిన ఫైళ్లు కాలిపోయాయనే అనుమానం ఉంది. రానున్న ఆరునెలలపాటు ప్రతి శని, ఆదివారాల్లో కార్యాలయాలపై నిఘా ఉంచాలి. ఆధారాలు కాల్చేయవచ్చు కానీ దేవుడి నుంచి అవినీతిపరులు తప్పించుకోలేరు. తిరుమలలో పూర్తిగా ప్రక్షాళన జరగలేదు. వైసీపీకి సంబంధించిన నాయకులు, వారి తొత్తులు, అధికారులు ఇంకా అన్ని విభాగాల్లో కొనసాగుతున్నారు. పరకామణి దొంగ రవికుమార్‌కు సంబంధించిన కొన్ని వివరాలు తమ వద్ద ఉన్నాయి. వాటిని త్వరలోనే ఈవోకు అందజేశాక మీడియాకు కూడా వెల్లడిస్తాం. ప్రస్తుతం తిరుమలలో ఎలాంటి వివాదాలు లేకుండా దర్శనాలు కొనసాగుతున్నాయి' అని కిరణ్ రాయల్ వివరించారు. కాగా, గత ప్రభుత్వం.. ఒకపార్టీకే చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు వారి కుటుంబ సభ్యులు, రెడ్లకు మాత్రమే దర్శనం చేయించిందని ఆయన మండిపడ్డారు.

ఐరాల మండలంలో గజదాడులు

ఐరాల, ఆగస్టు 19: ఐరాల మండలం బసివిరెడ్డిఇళ్లు, నయనంపల్లెలో ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి అటవీప్రాంతానికి సమీపంలోని పంట పొలాలపై దాడి చేసి వరి, అరటి, కొబ్బరి తోటలను ధ్వంసం చేశాయి. బసివిరెడ్డిఇళ్లకు చెందిన నరేంద్రకు చెందిన అరటి, వరి, భాస్కర్‌కు చెందిన వరి, నయనంపల్లెకు చెందిన రాజప్ప వరి, నయనంపల్లెకు చెందిన హేమాద్రి వరి పంట, జయచంద్రారెడ్డి కొబ్బరి తోటను ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. ఏనుగుల దాడులలో రైతులు సుమారు లక్ష రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లింది.

ఫొటో అంటే ఓ మధురమైన జ్ఞాపకం


జర్నలిస్టులతో కలసి ఫొటో ప్రదర్శనను వీక్షిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, మేయర్ శిరీష తదితరులు

మంగళం, ఆగస్టు 19: ఫొటో అంటే ఓ మధురమైన జ్ఞాపకం అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ డేని ప్రెస్‌క్లబ్‌లో జిల్లా ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చరిత్రలో గుర్తుండిపోయేలా ఓ సన్నివేశాన్ని నిక్షిప్తం చేయడానికి ఫొటోగ్రాఫర్ ఓ సాహసంతో కూడిన ప్రయత్నం చేస్తేనే సాధ్యమవుతుందని చెప్పారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ.. పదాలు చెప్పలేని భావాలను ఫొటోలు చెబుతాయన్నారు. ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఫొటోగ్రాఫర్ల దృష్టి కోణాలు అందరికీ రావని, నైపుణ్యతతో కూడిన వీక్షణ వారి సొంతం అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గిరిబాబు, జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, కార్యదర్శి లావణ్యకుమార్, కోశాధికారి శివయ్య, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ఫొటోగ్రాఫర్లు గోపాలకృష్ణ, పూర్ణచంద్ర, మాధవ, శ్రీనివాసులు, మోహనకృష్ణ, పీటర్, ప్రసాద్, హరిబాబు, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆ మూడేళ్లు మోసపోయాం..!

- అవసరమైన పనులు చేయకుండా దాటవేశారు
- నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట కార్పొరేటర్ నరసింహాచారి శాంతియుత నిరసన
- పెద్ద పనులకు బడ్జెట్ లేదన్న కమిషనర్ మౌర్య


నిరసన తెలుపుతున్న నరసింహాచారి

తిరుపతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): 'గడిచిన మూడేళ్లగా మా డివిజన్లలోని సమస్యలపై పోరాడుతూనే ఉన్నాను. కౌన్సిల్ సమావేశంలో గొంతెత్తుతూనే ఉన్నాను. పరిపాలన లోపాల గురించి స్టాండింగ్ కౌన్సిల్లో మొరపెట్టుకుంటూనే వచ్చా. కానీ న్యాయం జరగలేదు. ఎన్నోసార్లు వ్యక్తిగతంగా ఫిర్యాదులు చేశా. నలుగురు ఐఏఎస్ అధికారులు మారినా మా డివిజన్ ముఖచిత్రం మాత్రం మారలేదు. ఆ మూడేళ్లు ఎక్కువమంది కార్పొరేటర్లు మోసపోయారు. అందుకే శాంతియుత నిరసనకు దిగుతున్నా' అంటూ 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహాచారి అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఈ మేరకు సోమవారం ఉదయం నల్లదుస్తులు ధరించి, నేలపై బైఠాయించి, శాంతియుత నిరసన తెలిపారు. తొలినుంచి పెండింగ్‌లో ఉన్న తన డివిజన్ సమస్యలను ప్లకార్డులో రాసి.. తన చుట్టూ పెట్టుకుని దాదాపు నాలుగు గంటల పాటు ఎండలో కూర్చొన్నారు. పోలీసులు, కార్పొరేషన్ అధికారులు వచ్చి దీక్ష విరమించాలని కోరారు. కమిషనర్ వచ్చి హామీ ఇచ్చేంతవరకు నిరసన విరమించేది లేదని తేల్చిచెప్పారు. సీఎం చంద్రబాబుకు స్వాగతం పలకడానికి వెళ్లిన కమిషనర్ మౌర్య ఈ విషయం తెలుసుకుని మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చారు. నరసింహాచారి ఇచ్చిన వినతులను స్వీకరించారు. కార్పొరేషన్లో బడ్జెట్ లేదని మరో ఏడాది వరకు పెద్దపెద్ద పనులు ఇప్పుడే చేయలేమని చెప్పారు. ప్రాధాన్యత అంశాలను పరిశీలించి తక్కువ బడ్జెట్‌తో పూర్తయ్యే పనులు వెంటనే మొదలపెట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆమె ఆదేశించారు.

కార్పొరేటర్ డిమాండ్లివే..

రాయలచెరువు అప్పర్ పాస్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలి. చిన్నపాటి వర్షానికే మునిగిపోతున్న 25వ డివిజన్‌ను కాపాడాలి. కస్తూరిబాయి సన్న సందు, పెద్ద వీధిలో రోడ్డు, యూడీఎస్ పనులు చేపట్టాలి. అధ్వానంగా ఉన్న పల్లివీధిలోని గాంధీ రోడ్డు, కర్ణాల వీధి లేఅవుట్‌లో రోడ్డు పనులు మొదలుపెట్టాలి. మంచినీళ్లగుంట నీటి ప్రక్షాళన వెంటనే మొదలుపెట్టాలి. స్నాక్స్ బిల్స్‌పైన వివరాలు వెంటనే ఇవ్వాలి. అక్రమ ఉద్యోగ నియామకాలపై వెంటనే కమిటీవేసి నిజాలు నిగ్గుతేల్చాలి.. వంటి 10 డిమాండ్లను నరసింహాచారి.. కమిషనర్ ముందుంచారు. నరసింహాచారికి సంఘీభావంగా కార్పొరేటర్లు నరేంద్రనాథ్, అనిల్, దూదికుమారి భర్త శివ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో తిరుపతి క్రీడాకారుల ప్రతిభ



తిరుపతి (క్రీడలు), ఆగస్టు 19: సౌత్ ఇండియా జోనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో తిరుపతి క్రీడాకారులు ప్రతిభచాటారు. కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17, 18 తేదీల్లో చెన్నైలోని మైలవరం మౌంట్‌ఫోర్ట్ ఇండోర్ స్టేడియంలో జరిగిన సబ్‌జూనియర్, కేడెట్, జూనియర్, అండర్-21, సీనియర్ విభాగాలలో తిరుపతికి నవీన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన క్రీడాకారులు తలపడ్డారు. సతీశ్‌మేదాన్స్, నైతిక్‌జైన్(సిల్వర్‌మెడల్స్), ధనశ్రీ, దోమిక, మిథిల్ నరేష్, సాయివెంకటశివ, పవన్‌కుమార్‌లు (బ్రాంజ్ మెడల్స్) సాధించారు. క్రీడాకారులను, శిక్షకుడు నవీన్‌ను పలువురు సోమవారం అభినందించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.21 కోట్లు

తిరుమల,ఆగస్టు19(ఆంధ్రజ్యోతి):శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.21 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు ఇచ్చిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు జరిపి సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 85,935 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 31,222 మంది తలనీలాలు సమర్పించారు.


శ్రీవారి ఆలయం వద్ద జస్టిస్ వేలుమణి - బైరా రామకోటేశ్వరరావు - లక్ష్మణరావు - ఆర్వీ కుమార్

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ లక్ష్మణరావు, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వరరావు, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, తెలంగాణ సీఎం అడ్వైజర్ నరేంద్రరెడ్డి, చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేలుమణి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, తెలంగాణ ఎస్పీఎఫ్ డీజీ అనిల్‌కుమార్ ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి ఆలయంలో వైభవంగా శ్రావణ ఉపకర్మ

తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం శ్రావణ ఉపకర్మ వైభవంగా జరిగింది. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఉదయం ఆరు గంటలకు శ్రీకృష్ణస్వామివారిని భూవరాహస్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చి స్నపన తిరుమంజనం గావించారు. అనంతరం స్వామివారికి నూతన యజ్ఞోపవీతాన్ని సమర్పించి, ఆస్థానం నిర్వహించారు. తర్వాత స్వామి ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ పేష్కార్ శ్రీహరి, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్వామికి చాలా రుణపడిపోయా : హీరో నార్నె నితిన్


ఆలయం ముందు రాజ్‌కుమార్, నార్నె నితిన్, నయన్ సారిక

తిరుమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర స్వామికి చాలా రుణపడిపోయానని జూనియర్ ఎన్టీఆర్ బావమరిది హీరో నార్నె నితిన్ అన్నారు. ఇటీవల విడుదలైన తన 'ఆయ్' చిత్రం విజయవంతం కావడంతో ఆ చిత్ర హీరోయిన్ నయన్ సారిక, నటుడు రాజ్‌కుమార్ కసిరెడ్డితో కలిసి శ్రీవారిని సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. 'ఆయ్' చిత్రం విజయవంతం కావడంతో స్వామి ఆశీస్సుల కోసం వచ్చామన్నారు. 'మ్యాడ్' సినిమా హిట్ అయినప్పుడు కూడా స్వామి దగ్గరకే వచ్చానన్నారు. ఇకపై ప్రతి సినిమాకు స్వామి దగ్గరకు వచ్చి ఆశీస్సులు తీసుకుంటానని మొక్కుకున్నట్టు చెప్పారు. ప్రస్తుతం 'మ్యాడ్2' చిత్రం షూటింగ్ జరుగుతోందని, ఈఏడాది చివరిలో సినిమా అభిమానుల ముందుకు వస్తుందన్నారు. నయన్ సారిక మాట్లాడుతూ.. సినిమా హిట్ కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్వామి దర్శనం అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు.

డాక్టర్లకు న్యాయవాదుల మద్దతు


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తిరుపతి(లీగల్), ఆగస్టు 19: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచారాన్ని నిరసిస్తూ రుయా ఆస్పత్రి వద్ద ఆందోళన నిర్వహిస్తున్న వైద్యులకు తిరుపతి బార్ అసోసియేషన్ న్యాయవాదులు మద్దతు తెలిపారు. సోమవారం తిరుపతి కోర్టు నుంచి న్యాయవాదులు స్కూటర్ ర్యాలీగా ఆస్పత్రికి చేరుకుని సంఘీభావం ప్రకటించారు. అధ్యక్షుడు టి.గోపీచంద్, ప్రధానకార్యదర్శి మార్టిన్, న్యాయవాదులు బి.నరసింహారెడ్డి, దినకర్, సుమన్, హరినాథ్, వసుమతి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు

సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు



తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 19: రాష్ట్రంలోనే తొలిసారిగా రైల్వేకోడూరు విద్యాశాఖ కార్యాలయంలో ప్రభుత్వం హెచ్‌టీ స్మార్ట్ మీటర్‌ను ఏర్పాటు చేసినట్లు సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా స్మార్ట్ మీటర్లు అమర్చాలని ప్రభుత్వం ఈనెల 4వ తేదీ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మేరకు అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీటరు పనితీరును 15 రోజులుగా పరిశీలించామని పేర్కొన్నారు. పనితీరు బాగుండటంతో నివేదికలను ప్రభుత్వానికి పంపామన్నారు.

రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లు


తిరుపతి రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 19: వరుస సెలవులు రావడంతో తిరుమలకు ప్రయాణికుల రద్దీ పెరిగింది. తిరుపతి నుంచి వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను చేర్చడానికి ఆది, సోమవారాల్లో ఐదు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేశామని రైల్వే అధికారులు తెలిపారు. ఆదివారం తిరుపతి నుంచి కాచిగూడ, సికింద్రాబాదుకు రెండు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడిపారు. రద్దీ పెరగడంతో సోమవారం తిరుపతి నుంచి నాందేడ్, సత్రాగంజ్, నిస్సార్ ప్రాంతాలకు మూడు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ రద్దీ మాత్రం తగ్గడం లేదు. మంగళవారం కూడా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా, తిరుపతి రైల్వే స్టేషన్‌లో ఆధునీకరణ పనులు జరుగుతున్న కారణంగా పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి తగిన విధంగా మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలొస్తున్నాయి.

నమ్మాళ్వార్‌కు కానుకగా శఠారి



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 19: కపిలతీర్థంలోని నమ్మాళ్వార్ ఆలయానికి సోమవారం ఓ శఠారి కానుకగా అందింది. నగరానికి చెందిన సతీష్, జయలక్ష్మి దంపతులు రూ.90వేలతో తయారు చేయించిన వెండి శఠారిని పెద్ద జీయంగార్ ఆశీస్సులతో ఆలయ అర్చకులకు అందజేశారు. వైష్ణవ సంప్రదాయంలో నమ్మాళ్వార్ అంటే శఠారిగా భావిస్తారు. సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యుడు చక్రవర్తి రంగనాథన్ తదితరులు పాల్గొన్నారు.

సహజ జీవన శైలిని అనుసరించాలి

ప్రకృతి వనం ప్రసాద్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 19: సహజమైన జీవన శైలిని ఈ తరంవారు అనుసరించాల్సిన అవసరం ఉందని ప్రకృతి వనం నిర్వాహకుడు ప్రసాద్ సూచించారు. బీటెక్‌లో చేరిన విద్యార్థులకు ఎస్వీయూలో నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రాంలో ఆయన ప్రసంగించారు. ప్రకృతిసిద్ధ ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రతి ఉదయం స్వచ్ఛమైన గాలిని అస్వాదించాలని కోరారు. వర్షపు నీరు నేరుగా పట్టుకుని వాడాలన్నారు. పిజ్జా, బర్గర్‌కు బదులుగా రాగి, జొన్న, సజ్జలతో తయారు చేసిన ఆహారాన్ని తినాలన్నారు. శారీరక వ్యాయామం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హిందువులందరికీ జ్ఞానోదయం కలిగించాలని కోరుకున్నా

తెలంగాణ ఎంపీ ధర్మపురి అర్వింద్

తిరుమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని హిందువులందరికీ జ్ఞానోదయం కలిగించాలని శ్రీవారిని కోరుకున్నట్టు తెలంగాణ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. టీటీడీ నుంచి అమెరికాలోని టెక్సాస్ వరకు ఉన్న హిందువులందరూ ఐక్యంగా ఉండేలా ఆశీర్వదించమని, భారతావనని కాపాడుకోవాల్సిన బాధ్యతను అందరూ తీసుకోవాలని కోరుకున్నానన్నారు. బంగ్లాదేశ్ నిన్నటి వరకు మన ప్రాంతమేనన్నారు. అక్కడ జరిగింది.. ఇక్కడా జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. అందువల్ల అందరూ ఐక్యంగా ఉండాలని కోరారు. ఇక ఏపీలో ఏర్పడిన నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు.

దర్శన అక్రమంలో ఏపీటీడీసీకి సంబంధం లేదు

డివిజనల్ మేనేజర్ గిరిధర్

తిరుమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): 'తిరుమల శ్రీవారి ఏపీటీడీసీ రూ.300 దర్శన టికెట్లలో అక్రమం జరిగిందంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. ఈవ్యవహారంలో ఏపీటీడీసీకి, ఉద్యోగులకు ఎలాంటి సంబంధం లేదు' అని డివిజనల్ మేనేజర్ గిరిధర్ సోమవారం రాత్రి ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఏపీటీడీసీ (టూరిజం) పాత తేదీతో కూడిన టికెట్‌ను స్కాన్ చేసి పేర్లు, తేదీ, ధరలు మార్చేసి యాత్రికులకు దళారీలు విక్రయించారని చెప్పారు.శ్రీవారి భక్తులు ఏపీటీడీఎస్ అధికార వెబ్‌సైట్ నుంచే దర్శన టికెట్లను బుక్ చేసుకోవాలని, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని కోరారు.

అన్నదానం



తిరుపతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రావణ పూర్ణిమని పురస్కరించుకుని సోమవారం అలిపిరి పాదాలవద్ద జానపద వృత్తి కళాకారుల సంఘం అన్నదానం నిర్వహించింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సూచనలతో జనసేన నేత ఎం.నరసింహులు నాయుడు, సంఘ చైర్మన్ యాదగిరి, కార్యదర్శి మునీంద్రలు దాదాపు వెయ్యి మంది శ్రీవారి భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

అలిపిరిలో మద్యం కలకలం


నిందితుడు మురళి

తిరుమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు ముఖద్వారమైన అలిపిరిలో సోమవారం మద్యం కలకలం సృష్టించింది. తిరుమలలో నిషేధితమైన మద్యాన్ని తీసుకొస్తున్న ఓ వ్యక్తిని ఏసీబీ, విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. విజిలెన్స్ వివరాలమేరకు.. పది మద్యం బాటిళ్లను కె.మురళి అనే వ్యక్తి ఆర్టీసీ బస్సులో తిరుమలకు తీసుకొచ్చే ప్రయత్నం చేశాడు. అలిపిరిలోని గరుడ సర్కిల్ వద్దే ఇతడిని గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు తిరుమలలోని ఓ హోటల్‌లో మాస్టర్‌గా పనిచేస్తున్నట్టు తెలిసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాలతీ చందూర్ సాహిత్యంపై నేడు సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 19: మాలతీ చందూర్ సాహిత్యంపై పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో మంగళవారం సదస్సు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు సావేరి హాల్లో డీన్ ప్రొఫెసర్ వాణి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అనంతరం 'మాలతీ వనం' అంశంపై మిసిమి పత్రికా సంపాదకులు వల్లభనేని అశ్వినీకుమార్, పాశ్చాత్య నవలల సారాన్నందించిన మాలతీ చందూర్ అంశంపై ప్రొఫెసర్ వైఎస్ శారద, నవలల్లో స్త్రీవాద దృక్పథంపై యజ్ఞశేఖర్, కథా సాహిత్యంపై స్త్రీజీవిత చిత్రణ అంశంపై డాక్టర్ వై.సుభాషిణి ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రతిభా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు. ఈ మేరకు తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి, కార్యనిర్వాహకులు డాక్టర్ డి.యువశ్రీ తెలిపారు.



సీఎం చంద్రబాబుకు రాఖీ కట్టిన విజయశ్రీ



తడ, ఆగస్టు 19 : సీఎం చంద్రబాబుకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ రాఖీ కట్టి ఆయన నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. సోమవారం శ్రీసిటీ పర్యటనకు వచ్చిన ఆయన్ను హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సోమవారం రక్షాబంధన్ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే విజయశ్రీ సీఎంకు రాఖీ కట్టి కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. వారితోపాటు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కూడా ఉన్నారు.

సీఎం దృష్టికి ఆల్తూరుపాడు రిజర్వాయర్ సమస్య

ఎమ్మెల్యే కురుగొండ్ల



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కురుగొండ్ల

డక్కిలి, ఆగస్టు 19: జిల్లా పర్యటనకు విచ్చేసిన సీఎం చంద్రబాబు దృష్టికి ఆల్తూరుపాడు రిజర్వాయర్ సమస్యను తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చెప్పారు. సోమవారం సోమశిల జలాశయ పరిశీలనకు వచ్చిన సీఎంను కురుగొండ్ల మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ... డక్కిలి మండలం ఆల్తూరుపాడు గ్రామంలో అర్థంతరంగా ఆగిపోయిన సోమశిల-స్వర్ణముకి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ రిజర్వాయర్ నిర్మాణానికి రూ.400 కోట్లు కేటాయించ డమే కాకుండా పనులు మొదలు పెట్టారన్నారు. అనంతరం 2019లో వైసీపీ ప్రభుత్వం రీటెండర్ పేరుతో నిర్మాణాన్ని అడ్డుకుందన్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు, శ్రీకాళహస్తి, తిరుపతి, తిరుమలకు తాగునీటి సమస్య తీరుతుందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేలా చర్యలు

సీఎం చంద్రబాబును కలిసిన పాశం



గూడూరు, ఆగస్టు 19: శ్రీసిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం తిరుపతి విమానాశ్రమానికి చేరుకున్న సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేలా చర్యలు తీసుకోవాలని సీఎంకు విన్నవించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఘనంగా రక్షాబంధన్



విజయకుమార్‌నాయుడికి రాఖీ కడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ఓజిలి, ఆగస్టు 19 : మండలంలో సోమవారం రక్షాబంధన్ (రాఖీ) పండుగ ఘనంగా జరిగింది. ఈ పండుగను పురస్కరించుకుని తమ సోదరులకు అక్క, చెల్లెమ్మలు రాఖీలు కట్టి ప్రేమను చాటుకున్నారు. కాగా ఓజిలి మండల కన్వీనరు జి.విజయ కుమార్‌నాయుడికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ రాఖీ కట్టారు. అంతకుముందు చంద్రబాబు శ్రీసిటీ పర్యటనలో ఓజిలి మండల టీడీపీ నాయకులు జి.విజయకుమార్ నాయుడితో కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసందర్భంగా విజయకుమార్‌నాయుడు హోం మంత్రి వి.అనితను మర్యాదపూర్వకంగా కలిశారు.

సీఎంను కలిసిన వేనాటి



సూళ్లూరుపేట, ఆగస్టు 19: శ్రీసిటి పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబును టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీస్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీసిటీలోని హెలిప్యాడ్ వద్ద సీఎంకు తమ ప్రాంత సమస్యలను పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు.

తహసీల్దారుతో టీడీపీ నాయకుల భేటీ



కోట, ఆగస్టు 19: కోట తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు కె.జయజయ రావును టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. తెలుగు మహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి తహసీల్దారును శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. అదే విధంగా టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అనిల్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్, జానా వెంకటకృష్ణయ్య, చెంగ్రావు, ఎస్సీసెల్ అధ్యక్షుడు టి.మురళీ తహసీల్దారును సత్కరించారు.

నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు



కిషోర్‌బాబు

గూడూరు, ఆగస్టు 19: గూడూరు రూరల్ సర్కిల్ పరిధిలో నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపడుతానని రూరల్ సీఐ కిషోర్‌బాబు చెప్పారు. సోమవారం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లోని సీఐ కార్యాలయంలో సీఐగా బాధ్యతలు చేపట్టారు. విజయవాడ సీఐడీ ప్రధాన కార్యాలయం నుంచి గూడూరు రూరల్ సీఐగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గంజాయి, ఇసుక, క్వార్ట్జ్ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు అర్బన్, ఆగస్టు 19: మండలంలోని విందూరు గిరిజన కాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కాలనీలో అవసరం మేరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు అంధకారంలో జీవించాల్సి వస్తోందన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. విద్యుత్ స్తంభాలు దూరంగా ఉండడంతో ఇంటికి కరెంటు మీటరు బిగించుకోవాలన్నా ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. శివకుమార్, బీవీరమణయ్య, శ్రీనివాసులు, సురేష్, ప్రసాద్, శంకరయ్య, వెంకటరమణమ్మ, రాజ్యలక్ష్మీ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి సర్వే నిర్వహించండి



బాలాయపల్లి, ఆగస్టు 19: మండలంలో ప్రతి ఇంటికి వెళ్లి స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 సర్వే నిర్వహించాలని బీఎల్వోలను తహసీల్దార్ కెవిఆర్‌వి ప్రసాద్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బీఎల్వోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 20 నుంచి అక్టోబరు18 వరకు కొత్త ఓటర్ల చేర్పులు, చనిపోయిన ఓటర్ల తొలగింపులు, ఓటర్ల సవరణలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ శిరీష, ఏఎస్ఓ వరసుందరం తదితరులు పాల్గొన్నారు.

హత్యాచారంపై వెల్లువెత్తిన నిరసనలు



డీఆర్‌డబ్ల్యూ కళాశాల విద్యార్థినుల నిరసన



టవర్‌క్లాక్ వద్ద ఆదిశంకర విద్యార్థుల నిరసన



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న మహిళలు



సూళ్లూరుపేటలో ఉపాధ్యాయుల నిరసన

గూడూరు, ఆగస్టు 19: కోల్‌కతాలోని ఆర్జీకార్ వైద్యకళాశాలలో జూనియర్ మహిళా డాక్టర్ హత్యాచారం ఘటనను వ్యతిరేకిస్తూ సోమవారం పట్టణంలో పలువురు నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో బీజేవైఎం నాయకులు, కళాశాల విద్యార్థినులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధికారప్రతినిధి మనోజ్ కుమార్ మాట్లాడుతూ... కోల్‌కతాలో ట్రైనీ మహిళా డాక్టర్‌పై అత్యాచారం చేసి కిరాతకంగా హత్యచేసిన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలన్నారు. ఈ తరహా చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమంతరావు, కిరణ్‌కుమార్‌రెడ్డి, శివశంకర్, నవీన్, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు. స్థానిక టవర్ క్లాక్ కేంద్రం వద్ద ఆదిశంకర పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రూపవతి మాట్లాడుతూ... దేశంలో మహిళలపై హత్యాచారాలు, లైంగికదాడులు పెరగడం దురదృష్టకర మన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు స్పందించి బాధ్యతాయుతంగా వ్యవహరించి ఈ తరహా చర్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సునీత సేవాసంస్థ కార్యాలయంలో ట్రైనీ మహిళా డాక్టర్ హత్యాచారంపై నిరసన తెలుపుతూ ఆమె ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి, గ్రీష్మ, జ్యోతి, తనూజ, హసీనా తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

సూళ్లూరుపేట: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన చేశారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానం నుంచి ర్యాలీ నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మానస, నరేంద్ర, లోకేష్ తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద యూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక, సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న హత్యాచారాలు, దాడులకు నిరసనగా కొవ్వొత్తులు వెలిగించి నిందితులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల కార్యదర్శి ప్రభాకర్, సీఐయూటీ నాయకులు సాంబశివయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మొదలైన బదిలీల ప్రక్రియ



- చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య కలెక్టర్లతో కమిటీ
- ఐదేళ్లు దాటితే ఉన్నచోటు నుంచి కదలాల్సిందే
- 15 శాఖల్లో బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా
- నెలాఖరులోగా ప్రక్రియ పూర్తికి కసరత్తు
- సిఫార్సుల కోసం ఎమ్మెల్యేల వద్ద క్యూ కడుతున్న ఉద్యోగులు

చిత్తూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన రెండు నెలలకు బదిలీలకు పచ్చ జెండా ఊపింది. ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎ్‌సలతో పాటు కొన్నిచోట్ల డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ, తహసీల్దార్, ఎంపీడీవోల్ని బదిలీ చేసింది. ఈ క్రమంలో అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మిగిలిన ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం సిద్ధమైంది. తాజాగా బదిలీల మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నెలాఖరు వరకు బదిలీలపై నిషేధాన్ని తొలగించడంతో సోమవారం నుంచే సందడి మొదలైంది. 15 శాఖల్లో అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరగనున్నాయి. ఇప్పటికే వీఆర్వో, ఆర్‌ఐ, డిప్యూటీ తహసీల్దార్ల కొన్ని బదిలీల దరఖాస్తులు కలెక్టరేట్‌కు అందాయి.

ఈ శాఖల్లోనే బదిలీలు..

అన్ని శాఖల ఉద్యోగులందర్నీ బదిలీ చేయకుండా కేవలం ప్రజాసంబంధ వ్యవహారాలకు సంబంధించిన శాఖల్లోనే బదిలీలకు కూటమి ప్రభుత్వం ఎంచుకుంది. ప్రత్యేకించి పోలీసు, రెవెన్యూ, కమర్షియల్ ట్యాక్స్, పంచాయతీరాజ్, ఎక్సైజ్, అన్ని ఇంజనీరింగ్ విభాగాల్లో కలిపి మొత్తంగా 15 శాఖల్లో మాత్రమే బదిలీలు చేయాలని నిర్ణయించారు. ఆయా శాఖల్లో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేసి చాలా కాలమైంది. కొందరైతే తమకు నచ్చిన స్థానాల్లోనే ఒకేచోట ఏళ్లుగా పాతుకుపోయారు. ఇష్టానుసారంగా అవినీతికి పాల్పడ్డారు. మరికొందరు తమకు నచ్చిన పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చారు.

ముగ్గురు కలెక్టర్లతో కమిటీ

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలను చేపట్టేందుకు మూడు జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు సుమిత్‌కుమార్, వెంకటేశ్వర్, శ్రీధర్‌తో పాటు ఆయా జిల్లా డీఆర్వోలు కూడా ఈ కమిటీలో ఉంటారు. ఈ నెల 27, 28 తేదీల్లో ముగ్గురు కలెక్టర్లు నేరుగా, లేదా ఆన్‌లైన్ ద్వారా సమావేశమై దరఖాస్తుల్ని పరిశీలిస్తారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నెలాఖరులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు చిత్తూరు ఉమ్మడి జిల్లాలో జేసీలుగా పనిచేయడంతో ఓ అవగాహనతో బదిలీల వేగవంతానికి కృషి చేసే అవకాశముంది.

సచివాలయ ఉద్యోగుల పరిస్థితేంటి?

ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగుల్ని తప్పనిసరి బదిలీ చేయాలంటూ ప్రభుత్వం మార్గదర్శకాల్లో ఉంది. సచివాలయ వ్యవస్థ ప్రారంభమై ఇంకా ఐదేళ్లు పూర్తి కాలేదు. 2019 అక్టోబరు 2వ తేదీ నుంచి సచివాలయ వ్యవస్థ ప్రారంభించారు. సుమారు మూడు నెలల పాటు తొలి విడత ఉద్యోగుల్ని నియమించుకున్నారు. 2020 చివర్లో రెండో విడత ఉద్యోగుల భర్తీ చేశారు. కానీ, ఈ ఉద్యోగుల్లో కూడా నిజమైన అవసరమున్నవారు ఉన్నారు. అలాంటి వారిని కలెక్టర్లు ప్రత్యేకంగా భావించి బదిలీల్లో అవకాశం కల్పించాల్సి ఉంది.

సమస్యలుంటే నేరుగా చెప్పుకోవచ్చు



సిఫార్సు ఉంటేనే బదిలీలు చేస్తారని భావించకండి. నిజమైన సమస్య ఉంటే నేరుగా కలిసి దరఖాస్తు చేసుకోండి. పరిశీలించి బదిలీలకు అవకాశం కల్పిస్తాం. లాంగ్ స్టాండింగ్, కుటుంబ, ఆరోగ్య సమస్యలున్నవారికి బదిలీల్లో ప్రాధాన్యమిస్తున్నాం. సచివాలయ ఉద్యోగులకు ఐదేళ్లు పూర్తి కాలేదు. దీంతో మ్యూచువల్, కుటుంబ సమస్యలున్నవారినే బదిలీ చేయనున్నాం. అవకాశాన్ని బట్టి ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల్ని పరిగణనలోకి తీసుకుంటాం.

- సుమిత్‌కుమార్, చిత్తూరు కలెక్టర్

ఎమ్మెల్యేల సిఫార్సు తప్పనిసరంటూ ప్రచారం

వైసీపీ హయాంలో తహసీల్దార్, ఎంపీడీవో, సీఐ, ఎస్‌ఐ వంటి స్థాయి అధికారుల్ని స్థానిక ఎమ్మెల్యేలు వద్దనుకుంటే క్షణాల్లో బదిలీ చేసేవారు. అవసరమైన వారిని తెచ్చుకునేవారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు ఆ పరిస్థితి లేదు. అడిగిన తహసీల్దార్, సీఐ, ఎస్‌ఐలను ఇవ్వడం లేదని జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. తాజాగా బదిలీల జీవో రావడంతో.. ఎమ్మెల్యేల సిఫార్సు తప్పనిసరనే ప్రచారం ప్రారంభమైంది. దీంతో ఆయా శాఖల్లో అధికారులు, ఉద్యోగులు ఎవరి స్థాయిలో వారు సిఫార్సు లేఖల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. ద్వితీయ శ్రేణి నాయకుల్ని పట్టుకుని ఎమ్మెల్యేలను కలుస్తున్నారు.

వైసీపీతో అంటకాగినవారి జాబితా సిద్ధం

గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులతో అంటకాగి, వారి అక్రమాలకు సహకరించిన అధికారులు, ఉద్యోగుల జాబితాలను టీడీపీ నేతలు సిద్ధం చేశారు. బదిలీల్లో వారికి ప్రాధాన్యం లేకుండా చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. వైసీపీతో అంటకాగిన చాలామంది పోలీసు అధికారులకు ఇప్పటికే పోస్టింగ్ ఇవ్వలేదు. వారిలో అప్పటి ఎస్పీ రిషాంత్‌రెడ్డి, డీఎస్పీ సుధాకర్ రెడ్డి, సీఐ గంగిరెడ్డి సహా ఓ స్థాయిలో వైసీపీ కోసం పనిచేసిన డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు ఉన్నారు. కొందర్ని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోమని ఉత్తర్వులు ఇవ్వగా.. మరికొందర్ని వీఆర్‌కు పంపించారు.

వైసీపీ నేత ఆక్రమిత ప్రభుత్వ భూమి స్వాధీనం

డక్కిలి, ఆగస్టు 19: మండలంలోని పలుగోడు గ్రామానికి చెందిన వైసీపీ నేత ప్రభుత్వ భూమిని ఆక్రమించి కంచె ఏర్పాటు చేశారని ఫిర్యాదు అందడంతో సోమవారం రెవెన్యూ అధికారులు దాన్ని తొలగించారు. మరో 40 సెంట్లకు అక్రమంగా అడంగళ్ తీసుకున్నారని, దాన్ని పరిశీలించి రద్దు చేస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని,ఇందులో భాగంగా ఫిర్యాదులు అందితే తక్షణమే స్పందిస్తున్నామన్నారు. వీఆర్వోలు భూములు ఆక్రమణకు గురికాకుండా క్షేత్రస్థాయిలో నిఘా ఉంచాలని ఆదేశించామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించినట్టు తేలితే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ఆక్రమణ తొలగింపులో వీఆర్వోలు ఆమని, నాగేంద్ర సహా సిబ్బంది పాల్గొన్నారు.

'కోణార్క్' వేరుశనగ రకం తిరుపతి ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ప్రాణం పోసుకుంది

ఏడీఆర్ సుమతి వెల్లడి



శాస్త్రవేత్తలతో కలసి కోణార్క్ వేరుశనగ రకాన్ని ప్రదర్శిస్తున్న సుమతి

తిరుపతి రూరల్, ఆగస్టు 19: 'దేశప్రధాని నరేంద్రమోదీ ఈనెల 11వ తేదీన న్యూఢిల్లీలోని అఖిల భారత వ్యవసాయసంస్థలో విడుదల చేసిన 109 రకాల కొత్త వంగడాల్లో కోణార్క్ (టీసీజీఎస్-1707)రకం తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం (ఆర్‌ఏఆర్‌ఎస్)లో ప్రాణం పోసుకుంది. ఇందులో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌పీ వాసంతి నేతృత్వంలో మొక్కల ప్రజనన విభాగ (ప్లాంట్ బ్రీడింగ్) శాస్త్రవేత్తలు జాన్, శ్రీవిద్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, అమరావతి కీలకపాత్ర పోషించారు. 2013లో ఈ పరిశోధన చేపట్టగా, ఈ ఏడాదిలో కొత్తరకం వంగడం సిద్ధమైంది' అని సోమవారం ఆర్‌ఏఆర్‌ఎస్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో శాస్త్రవేత్తలతో కలిసి ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి వెల్లడించారు. ఇటీవల వివిధ వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన రకాలను డెవలప్‌చేసి విడుదల చేశామని వివరించారు. 2022లో విశిష్ట(టీసీజీఎస్-1694), 2023లో హిమనీ(టీసీజీఎస్-1522) రకాలను విడుదల చేయగా.. 2024లో కొత్తవంగడం కోణార్క్(టీసీజీఎస్-1707)ని ప్రధాని నరేంద్రమోదీ విడుదల చేశారని తెలిపారు. శాస్త్రవేత్తలు మురళీకృష్ణ, ప్రతిమ, కదిరిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కోణార్క్(టీసీజీఎస్-1707) ప్రత్యేకతలు

మనదేశంలో ఒడిశా, వెస్ట్‌బెంగాల్ రాష్ట్రాల్లో ఖరీఫ్ సీజన్లో సాగు చేసేందుకు అనువైన రకం. ఇది చిన్న గుత్తిరకం. పంటకాలం 105-110 రోజులు. హెక్టారుకు 25క్వింటాళ్ల వరకు దిగుబడి. కాయనుంచి పప్పు దిగుబడి 70-75శాతం ఉంటుంది. నూనె 49శాతం వరకు ఉంటుంది. రసం పీల్చే పురుగులను తట్టుకుంటుంది. ఆకుమచ్చ తెగులు, వేరుకుళ్లు, కాండం కుళ్లు, వేరుఎండు తెగుళ్లని మధ్యస్తంగా తట్టుకుంటుంది. అధిక నీటి వినియోగ సామర్థ్య రకం. గింజలు గులాబీ రంగులో ఉండి కాయలన్నీ ఒకేసారి పక్వానికి వస్తాయి. గింజల్లో నిద్రావస్థ రెండువారాలు వరకు ఉంటుంది. కాగా తల్లిగా (జీపీబీడీ-4)ని, తండ్రిగా ఐసీజీ(ఎఫ్‌డీఆర్‌ఎస్)79ని సంకరం ద్వారా దీన్ని వృద్ధి చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.21 కోట్లు

తిరుమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.21 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించి సోమవారం ఉదయం ప్రకటించింది.

పీఆర్‌జీఎస్ అర్జీలకు సత్వర పరిష్కారం

నాయుడుపేట టౌన్, ఆగస్టు 19: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరిస్తున్న అర్జీలను సత్వరం పరిష్కరిస్తున్నట్టు నాయుడుపేట తహసీల్దారు గీతావాణి తెలిపారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పలు అర్జీలను తహసీల్దారు స్వీకరించారు. అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకారం

సూళ్లూరుపేట, ఆగస్టు 19: సూళ్లూరుపేట ఎస్‌ఐగా వి.బ్రహ్మనాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తుండిన ఎస్‌ఐ రహీం రెడ్డి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో బ్రహ్మనాయుడుని నియమించారు. ఈ మేరకు ఆయన స్టేషన్‌కు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి అభినందలు తెలిపారు.

శాస్త్రోక్తంగా చండీహోమం



చిల్లకూరు, ఆగస్టు 19: మండలంలోని తూర్పుకనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ముత్యాలమ్మకు ప్రత్యేకపూజలు జరిపారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు హోమంలో పాల్గొన్నారు. అనంతరం ముత్యాలమ్మను దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

హిందువులందరికీ జ్ఞానోదయం కలిగించాలని కోరుకున్నా

తెలంగాణ ఎంపీ అర్వింద్

తిరుమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని హిందువులందరికీ జ్ఞానోదయం కలిగించాలని శ్రీవారిని కోరుకున్నట్టు తెలంగాణ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. టీటీడీ నుంచి అమెరికాలోని టెక్సస్ వరకు ఉన్న హిందువులందరూ ఐక్యంగా ఉండేలా ఆశీర్వదించమని, భారతావనిని కాపాడుకోవాల్సిన బాధ్యతను అందరూ తీసుకోవాలని కోరుకున్నానన్నారు. బంగ్లాదేశ్ నిన్నటి వరకు మన ప్రాంతమేనన్నారు. అక్కడ జరిగింది.. ఇక్కడా జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. అందువల్ల అందరూ ఐక్యంగా ఉండాలని కోరారు. ఇక ఏపీలో ఏర్పడిన నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న ట్రాక్టర్లు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 19: నాయుడుపేట మండలం పండ్లూరు జాతీయ రహదారి సమీపంలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అర్బన్ సీఐ బాబి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం తెల్లవారుజామున సీఐ సిబ్బందితో కలసి జాతీయ రహదారి సమీపంలో వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్టు గుర్తించారు. నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చల్లాయానాదుల కాలనీలో అధికారుల బృందం



బడి బయటి పిల్లలతో అధికారులు

కోట, ఆగస్టు 19: మండలంలోని తిన్నెలపూడి పంచాయతీలో గల సాయినగర్ చల్లాయానాదుల గిరిజన కాలనీలో సోమవారం అధికారుల బృందం పర్యటించింది. తిరుపతి సమగ్ర శిక్ష కార్యాలయ ఏఎంవో శివశంకర్, ఏఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీధర్, ఎంఈవో మస్తానయ్య బృందం తల్లిదండ్రులతో చర్చించి ఇక్కడ కాలనీలో ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేయనుంది. బడి బయటి ప్రతి బిడ్డా పాఠశాలలో చేరేలా గిరిజనులకు అవగాహన కల్పించారు.

స్వచ్ఛంద సంస్థలు దత్తత తీసుకోవాలి



నోటు పుస్తకాల పంపిణీలో టీడీపీ నేతలు

కోట, ఆగస్టు 19: పల్లెల్లో వెనుకబడిన గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు స్వచ్ఛంద సంస్థలు గ్రామాలను దత్తత తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.సర్వోత్తమరెడ్డి కోరారు. మండలంలోని తిమ్మానాయుడు పాళెంలో సోమవారం ఎస్తేర్ రాణి ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులకు విద్యాసామగ్రి, పలు అంగన్‌వాడీలకు పలకలు, పెన్సిళ్లు, ఎగ్‌బౌల్‌తో పాటు పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. టీడీపీ నేత ఎస్.మోహన్ రెడ్డి, సంస్థ వ్యవస్థాపకురాలు ఏస్తేర్ రాణి, సభ్యులు నాగేంద్ర, గురునాథం, బత్తయ్య, మునీంద్ర, నాగరాజు, ఎంఈవో మస్తానయ్య, హెచ్‌ఎం మునికృష్ణ తదితరులు ఉన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ఆవిష్కరణలపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యఅతిథి దామోదర రెడ్డి

కోట, ఆగస్టు 19: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈడీ సెల్ ఆధ్వర్యంలో 'రోల్ ఆఫ్ ఇన్నోవేషన్ ఆన్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ ఎకనామిక్ గ్రోత్' అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సును కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి డాక్టర్ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు తాము చదువుతున్న కోర్సులో పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని సూచించారు. విద్యార్థులకు ఆవిష్కరణలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ ప్రతిభా పాటవాల ద్వారా సమాజానికి ఉపయోగపడే విధంగా ఆవిష్కరణలు చేయాలన్నారు. ఏరో స్పేస్ టెక్నాలజీలో కావాల్సిన నైపుణ్యాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి విక్రమ్‌కుమార్, డాక్టర్ శ్రీహరిరెడ్డి ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

రేపు కొత్తపట్నంలో భూ సర్వే గ్రామసభ

కోట, ఆగస్టు 19: మండల పరిధిలోని కొత్తపట్నం సచివాలయంలో ఈ నెల 21వ తేదీన ఉదయం 10 గంటలకు కొత్తపట్నంలో సర్వే చేసిన భూములకు సంబంధించి గ్రామసభ నిర్వహించనున్నట్టు తహసీల్దారు జయజయరావు సోమవారం తెలిపారు. గత నెల 24వ తేదీ నుంచి కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాసపురం, యమదిన్నెపాళెం, గున్నంపడియా, గోవిందపల్లి, గోవిందపల్లిపాళెం, మిట్టపాళెం, వావిళ్లదొరువు గ్రామాల్లో భూ సర్వే చేశామన్నారు. ఆయా భూములకు సంబంధించి సాగుదారుల వివరాలను గ్రామసభలో చదివి వినిపిస్తామన్నారు. ఈ గ్రామసభకు సాగుదారులు అందరూ హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయాలని తహసీల్దారు కోరారు.

ముగిసిన స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులు



శిక్షణ ఇస్తున్న ఎంఈవో శంకరయ్య

పెళ్లకూరు, ఆగస్టు 19: రెండు రోజులపాటు నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులు ముగిశాయని పెళ్లకూరు మండల విద్యాశాఖ అధికారి శంకరయ్య అన్నారు. సోమవారం విద్యావనరుల కేంద్రంలో రెండో రోజు జరిగిన తరగతుల్లో ఎంఈవో పాల్గొన్నారు. ప్రాథమిక విద్యార్థుల కోసం విద్యాప్రవేశ్, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంపుదల కొరకు విద్యాప్రవేశం, మాదక ద్రవ్యాలను అడ్డుకోవడానికి ప్రహరీ క్లబ్ ఏర్పాటు, పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం, క్లాస్ రూం అబ్జర్వేషన్ కోసం టీచ్‌టూల్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు సాయి, శివ, సుధీర్, హరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

శ్రీసిటీలో చంద్రబాబుకు పూర్ణకుంభ స్వాగతం

సత్యవేడు, ఆగస్టు 19: పలు పరిశ్రమల భూమి పూజలు, ప్రారంభోత్సవాల నిమిత్తం సోమవారం శ్రీసిటీ పర్యటనకు విచ్చేసిన సీఎం చంద్రబాబుకు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. శ్రీసిటీ హెలిపాడ్ వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీసిటీ ఛైర్మన్ శ్రీనిరాజు, ఎండీ రవీంద్రసన్నారెడ్డి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అక్కడ నుంచి బిజినెస్ సెంటర్‌కు చేరుకున్న సీఎంకు పూర్ణకుంభం, మేళతాళాలతో ఆహ్వానం పలికారు. పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఇండస్ట్రీస్ డైరెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఏపీఐఐసీ ఎండీ, వీసీ అభిషిక్త కిషోర్, డీఐజీ షిమోషీ బాజ్‌పాయ్, ఎస్పీ సుబ్బారాయుడు, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు హేమలత, నెలవల సుబ్రమణ్యం, పరసా రత్నం, వరప్రసాద్, ఎస్సీవీ నాయుడు తదితరులు స్వాగతం పలికారు.

టీడీపీ నాయకుల సందడి

సీఎం పర్యటన నేపథ్యంలో శ్రీసిటీ హెలిప్యాడ్ వద్ద సత్యవేడు నియోజకవర్గ టీడీపీ నాయకుల సందడి నెలకొంది. మాజీ ఎమ్మెల్యే హేమలత, ఆమె కుమార్తె డాక్టర్ హెలెన్ చంద్రబాబును హెలిప్యాడ్ వద్ద కలిసి శాలువా, పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. టీడీపీ అబ్జర్వర్ చంద్రశేఖర్ నాయుడు, నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పరమశివం, యుగంధర్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, శ్రీనివాస్ యాదవ్, రామాంజుల నాయుడు, గోపినాథ్‌రెడ్డి తదితరులు చంద్రబాబును కలిసి స్వాగతం పలికారు.

కోనలో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయండి


హోంమంత్రి అనితకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, ఆగస్టు 19: మండల పరిధిలో కైలాసనాథకోన వద్ద పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం రాష్ట్ర హోం మంత్రి అనితకు విజ్ఞప్తి చేశారు. సోమవారం చంద్రబాబు శ్రీసిటీ పర్యటనలో భాగంగా హోంమంత్రి అనిత కూడా శ్రీసిటీకి విచ్చేశారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే ఆదిమూలం ఆమెకు వినతి పత్రాన్ని అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలో ప్రముఖ పర్యాటక స్థలం, పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న కైలాసనాథ కోనకు నిత్యం చుట్టుప్రక్కల ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వస్తుంటారని తెలిపారు. కొంతమంది మద్యం సేవించి పర్యాటక కేంద్రంలో అలజడి సృష్టించడమే కాకుండా, వారి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని చెప్పారు. ఈ సమస్య పరిష్కారం కోసం కైలాసనాథకోన వద్ద పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. స్పందించిన హోం మంత్రి అధికారులతో చర్చించి ఏర్పాటు చేస్తామని తెలిపారు.

గంజాయి మత్తులో కోడికత్తితో దాడి

- ఇద్దరికి తీవ్రగాయాలు


గాయపడిన యువకుడు

వరదయ్యపాళెం, ఆగస్టు 19: గంజాయి మత్తులో ఓ వ్యక్తి యువకుడిపై కత్తితో దాడి చేయగా.. అడువచ్చిన మరో యువకుడిపై కూడా దాడికి పాల్పడటంతో ఇద్దరు తీవ్రగాయాల పాలైన ఘటన మండలంలోని ఇందిరానగర్ పంచాయతీ ఇందిరానగర్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఇందిరానగర్ పంచాయతీ ఇందిరానగర్ కాలనీకి చెందిన శ్రీనుకు అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులుతో పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శ్రీనివాసులను శ్రీను పలుమార్లు బెదిరించడమే కాకుండా అంతూ చూస్తానంటూ శ్రీనివాసులు స్నేహితుడు విష్ణుతో హెచ్చరించాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి గంజాయి మత్తులో ఉన్న శ్రీను తన వెంట తెచ్చుకున్న కోడికత్తితో శ్రీనివాసులుపై దాడి చేయగా అక్కడే ఉన్న అతడి స్నేహితుడు విష్ణు అడ్డుకోబోయాడు. అతడిపై కూడా దాడి చేయడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానిక ప్రథమ చికిత్స కేంద్రంలో చికిత్స చేయించుకున్న అనంతరం సత్యవేడు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందారు. సోమవారం బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ముక్కంటి సేవలో సీఎం అదనపు కార్యదర్శి

శ్రీకాళహస్తి, ఆగస్టు 19: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి కార్తికేయ మిశ్రా, కలెక్టర్ వెంకటేశ్వర్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపటి నుంచి శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ, త్రిదిన మహోత్సవం

వడమాలపేట, ఆగస్టు 19: వడమాలపేటలోని కావలి వీధిలో ఈ నెల 21 నుంచి శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక త్రిదిన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎన్ఆర్ఐ చమర్తిరాజు, శిరీషలు తెలిపారు. నాయుడుపేటలోని వాసమ్మ ఆశ్రమ అధీనులు వాసుదేవానంద స్వామి ఆశీస్సులతో మూడు రోజుల పాటు ఈ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21న అగ్ని ప్రతిష్ఠ, నవగ్రహ మండపారాధన, లఘు పూర్ణాహుతి, 22న నవవిధ స్నపన రాత్రి శిఖ ప్రతిష్ఠ, ఆధారపీఠ పూజ, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, 23న కుంభ జల సంప్రోక్షణ, మహా కుంభాభిషేకం, విశేష ద్రవ్యాలతో అభిషేకం, సాయంత్రం శాంతి కల్యాణం, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

వరదయ్యపాళెం, ఆగస్టు 19: వరదయ్యపాళెం మండలం పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. వైద్యురాలు లావణ్య, స్టాఫ్ నర్సును సమస్యలపై ఆరా తీశారు.

భూకుంభకోణాలపై చర్యలు తీసుకోండి


చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, ఆగస్టు 19: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత వైసీపీ పాలనలో మాజీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు చేసిన భూకుంభకోణాలపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబును బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కోరారు. శ్రీసిటీలో పలు పరిశ్రమల భూమి పూజకు సోమవారం విచ్చేసిన చంద్రబాబును శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ స్వాగతం పలికారు. అనంతరం సీఎంకు వినతిపత్రం అందజేశారు. కోలా ఆనంద్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున భూకబ్జాలు చేశారన్నారు. చంద్రబాబుకు ఆధారాలతో సహా అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈడీ చేత విచారణ చేయించాలని కోరినట్లు చెప్పారు. నాయకులు డాలర్ దివాకర్‌రెడ్డి, మేళాగారం సుబ్రహ్మణ్యం, ఎస్వీ రమణ, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన పవన్‌కుమార్



వరదయ్యపాళెం, ఆగస్టు 19: పలు పరిశ్రమలకు ప్రారంభోత్సవం, భూమిపూజ కార్యక్రమాల నిమిత్తం సోమవారం శ్రీసిటీకి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి పవన్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మాజీ ఎమ్మెల్యే హేమలత, నాయకులు చలపతి నాయుడు, నందకిషోర్‌రెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, మహేష్, దశరథన్, శివకుమార్, యుగంధర్‌రెడ్డి, నిర్మల్, నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అరుణకు కృష్ణా జలాలు అనుసంధానం చేయండి


సీఎంను కలసిన ఇళంగోవన్‌రెడ్డి

పిచ్చాటూరు, ఆగస్టు 19: తూర్పు మండలాల దీర్ఘకాలిక కలగా మిగిలిన అరుణానదికి కృష్ణా నది జలాలను అనుసంధానంచేసి ఈ ప్రాంత వాసుల తాగునీటి కష్టాలు తొలగించాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును ఏఎంసీ మాజీ ఛైర్మన్, ప్రస్తుత క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి ప్రాధేయపడ్డారు. సోమవారం శ్రీసిటీకి వచ్చిన చంద్రబాబుకు స్వాగతం పలుకుతూ శాలువతో సన్మానించారు.

చాముండేశ్వరికి ప్రత్యేక పూజలు


అన్నదానం చేస్తున్న మిద్దెల హరి

శ్రీకాళహస్తి, ఆగస్టు 19: పట్టణంలోని భాస్కరపేటలో వెలసిన చాముండేశ్వరికి శ్రావణపౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు రకాల అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఏపీఎస్ ఆర్టీసీ మాజీ వైస్‌ఛైర్మన్ మిద్దెల హరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అన్నదాన నిర్వహణ కోసం ఆయన రూ.5,116ను విరాళంగా ఇచ్చారు. చల్లా జయరామయ్య, పులి రాధయ్య, కన్నా నాగయ్య, చెన్నయ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

వరదయ్యపాళెం, ఆగస్టు 19: వరదయ్యపాలెం ఎస్ఐగా కేబీ మల్లికార్జున నాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కడపలో ఎస్ఐగా పనిచేస్తూ సాధారణ బదిలీలలో వరదయ్యపాళెంకు వచ్చారు.

సీఎం చంద్రబాబుకు సాదరవీడ్కోలు


ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, గాలి భానుప్రకాష్ స్వాగతం

రేణిగుంట, ఆగస్టు 19: ముఖ్యమంత్రి చంద్రబాబుకు రేణిగుంటలోని విమానాశ్రయంలో సోమవారం మధ్యాహ్నం ఘనస్వాగతం, సాయంత్రం సాదరవీడ్కోలు లభించింది. శ్రీసిటీ పర్యటన నిమిత్తం సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు చంద్రబాబు విమానాశ్రయానికి చేరుకున్నారు. శ్రీకాళహస్తి, తిరుపతి, చంద్రగిరి, నగరి, గూడూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, పాశం సునీల్‌కుమార్, కలికిరి మురళీమోహన్, తిరుపతి కమిషనర్ మౌర్య, జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ నాయుడు, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రవి నాయుడు తదితరులు స్వాగతం పలికారు. కోట వినుత సీఎంకు రాఖీ కట్టారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జూడాల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.శ్రీసిటీ,సోమశిల ప్రాజెక్టు పర్యటన ముగించుకుని సోమవారం సాయంత్రం 6గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న చంద్రబాబు విజయవాడకు తిరుగుపయనమయ్యారు. కలెక్టర్ వెంకటేశ్వర్, డీఐజీ షిమోషి బాజ్‌పాయ్, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, డీఆర్వో కిషోర్,ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, రేణిగుంట తహసీల్దారు సురేష్‌బాబు, టీడీపీ నాయకులు పి.ఇందుశేఖర్ నాయుడు, నరసింహయాదవ్, శ్రీధర్‌వర్మ, ఆర్సీ మునికృష్ణ, మనోహర్ ఆచారి తదితరులు చంద్రబాబుకు వీడ్కోలు పలికారు.


ఎమ్మెల్యే నాని, సుగుణమ్మ, నరసింహయాదవ్ వీడ్కోలు


చంద్రబాబుకు రాఖీ కడుతున్న కోట వినుత

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, ఆగస్టు 19: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణపౌర్ణమి సోమవారం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్లద్వారా 1,677మంది, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్లద్వారా 1,879మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,500మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 945, రూ.1,500 టిక్కెట్లద్వారా 340మంది, రూ.2,500 టిక్కెట్లద్వారా 193మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 73మంది భక్తులు పూజలుచేయించుకున్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



శ్రీకాళహస్తి, ఆగస్టు 19: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం రాత్రి పౌర్ణమిని పురస్కరించుకుని ఊంజల్ సేవ నేత్రపర్వంగా కొనసాగింది. మొదట ఆలయంలోని అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఉత్సవమూర్తులకు పలు అభిషేక పూజలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠింపజేసి ఊంజల్‌సేవ మండపానికి తీసుకువచ్చారు. ఊయల ఊగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

జేబీఆర్ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ



పిచ్చాటూరు, ఆగస్టు 19: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా సోమవారం పిచ్చాటూరులో జేబీఆర్ విద్యాసంస్థల ఛైర్మన్ మునిరత్నం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జేబీఆర్ పాఠశాల, కళాశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు కొవ్వొత్తులతో, నల్లటి రిబ్బన్ ధరించి భారీ ర్యాలీ నిర్వహించారు. మునిరత్నం మాట్లాడుతూ.. దారుణ హత్యకు గురైన జూడా ఆత్మకు శాంతి కలగాలంటే దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులతో పిచ్చాటూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి బజారు వీధి గుండా ఎస్‌బీఐ వరకు డాక్టర్ సేవ్ అంటూ నినాదాలతో కొవ్వొత్తులు చేతపట్టి, భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఏవో, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోళ్ల పెంపకంలో మెలకువలపై శిక్షణ

రేణిగుంట, ఆగస్టు 19: రాస్ కృషి విజ్ఞాన్ కేంద్రంలో కోళ్ల పెంపకంలో మెలకువలపై వారం రోజులపాటు జరిగే శిక్షణా తరగతులను సోమవారం ప్రారంభించారు. మండల పరిధిలోని చైతన్యపురంలో ఉన్న రాస్ విజ్ఞాన కేంద్రంలో 18 నుంచి 40 సంవత్సరాల గ్రామీణ యువతకు శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ వారం రోజులపాటు జరిగే శిక్షణా తరగతుల్లో వివిధ రకాల కోళ్ల జాతులు, వాటిపెంపకం, తెగుళ్ల, యాజమాన్యం, మార్కెటింగ్ విలువ జోడింపు తదితర అంశాలపై మాట్లాడారు. డాక్టర్ అనూష, శ్రీలత, సుధాకర్, రామ్‌కుమార్, యువత పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్



శ్రీకాళహస్తి, ఆగస్టు 19: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద పండితులు వారినిఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పోగొట్టుకున్న బ్రాస్లెట్ భక్తుడికి అందజేత



శ్రీకాళహస్తి, ఆగస్టు 19: శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్ల దర్శనార్థం బుచ్చినాయుడుకండ్రిగ మండలం కారణిమిట్ట గ్రామానికి చెందిన మణికంఠయ్య సోమవారం వచ్చాడు. దర్శనానికి వెళ్లే సమయంలో తన చేతిలోని బ్రాస్లెట్‌ను పోగొట్టుకున్నాడు. గుర్తించిన ఆల య అధికారులు దానిని ఎస్‌పీఎఫ్ సిబ్బందికి అందజేశారు. వారు మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా తెలపగా, మణికంఠయ్య సరైన ఆధారాలు చెప్పడంతో అతడికి అందజేశారు. ఆయన ఆలయ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీఎఫ్ సిబ్బంది, ఆలయ అధికారులు కృష్ణారెడ్డి, నాగభూషణం యాదవ్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి విజ్ఞానంతో విజేతగా ఎదగాలి

ఏర్పేడు, ఆగస్టు 19: ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెట్విన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఇంటర్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం జరిగింది. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ నంద్యాల వెంకటసుబ్బమ్మ మాట్లాడుతూ విజ్ఞానమే విద్యార్థులకు శక్తివంతమైన ఆయుధమని తెలిపారు. సెట్విన్ మేనేజరు మోహన్‌కుమార్ మాట్లాడుతూ శారీరక, మానసిక వికాసంలో ప్రతి విద్యార్థి శ్రద్ధ చూపాలన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎస్ఎన్ రెడ్డి పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉండే ఉద్యోగావకాశాల గురించి వివరించారు. అధ్యాపకులు ఉమ, రామాంజులు, వెంకటసురేష్, రాఘవరెడ్డి, శంకరప్ప, సువర్ణ, అమరేశ్వర్‌రెడ్డి, సమీర్, నారాయణబాబు, శ్రీమన్నారాయణ, వైవీ రాధా, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీరోడ్డుకు భూమిపూజ

ఏర్పేడు, ఆగస్టు 19: గడచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను పూర్తిగా పట్టించుకోకపోవడంతో రోడ్లు అధ్వానంగా మారాయని టీడీపీ సీనియర్ నేత, మాజీ జడ్పీటీసీ పేరం ధనంజయులు నాయుడు అన్నారు. ఏర్పేడు మండలం గోవిందవరం పంచాయతీ బీసీ కాలనీ నుంచి శ్మశానవాటిక వరకు నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు ధనంజయులు నాయుడు సోమవారం భూమిపూజ చేశారు. గోవిందరం పంచాయతీ బీసీ కాలనీ నుంచి శ్మశానవాటిక వరకు సుమారు 350 మీటర్ల వరకు రూ.20లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మిస్తున్నామని చెప్పారు. టీడీపీ నాయకులు పేరం చిరంజీవులునాయుడు, భూపతినాయుడు, నాగరాజునాయుడు, రమేష్‌చౌదరి, సురేంద్రరాయ్, మహేష్‌నాయుడు, మణి నాయుడు పాల్గొన్నారు.

పీటీఆర్ఎస్‌కు డుమ్మా కొట్టిన ఎంపీడీవో


ఖాళీగా ఉన్న ఎంపీడీవో కుర్చీ

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 19: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీలు స్వీకరించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ ఎంపీడీవో సాయి లహరి మాత్రం సోమవారం విధులకు డుమ్మా కొట్టారు. దీంతో ప్రజలు, ప్రజా ప్రతినిధులు వేచి ఉండాల్సి వచ్చింది. ఎంపీడీవో మధ్యాహ్నం వరకు రాకపోవడంతో నిరాశతో తిరిగి వెళ్లిపోయారు.

శ్మశానానికి దారి ఏర్పాటు చేయించండి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 19: మండలంలోని కొత్తపాళెం శ్మశానానికి దారి ఏర్పాటు చేయాలని తహసీల్దార్ సుబ్రమణ్యానికి సర్పంచ్ హరిప్రసాద్ సోమవారం వినతిపత్రం అందజేశారు.

పుత్తూరు వార్తలు

కొవ్వొత్తుల ర్యాలీ



ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల కొవ్వొత్తుల ర్యాలీ

పుత్తూరు టౌన్, ఆగస్టు 19: కోల్‌కత్తా నగరంలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అమానుష ఘటనకు నిరసిస్తూ యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కందల శ్రీదేవి ఆధ్వర్యంలో పుత్తూరు యూటీఎఫ్ ఉపాధ్యాయులు పట్టణంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ జూడాపై హత్యాచారం చేసిన దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా యూటీఎఫ్ కార్యదర్శులు శేఖర్, గీతమ్మ, భాస్కర్, చెంగల్‌రాజు, హరిబాబు, వేణుగోపాల్, దాసరి మునెయ్య, విజయనాగు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో...

జూడాపై జరిగిన అమానుష ఘటనను నిరసిస్తూ, దోషులను శిక్షించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ పుత్తూరు డివిజన్ గౌరవాధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి సాయికిరణ్, రాజేంద్ర, అను, అభి, రేష్మ, జెస్సీ వెన్నెల, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు అభినందనీయం


స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లు

పుత్తూరు టౌన్, ఆగస్టు 19: పుత్తూరులో సోమవారంతో ముగిసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల వార్షిక బ్రహ్మోత్సవాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు అభినందనీయమని పుత్తూరు ఎస్ఐ వెంకట మోహన కృష్ణ ప్రశంసించారు. గత మూడు రోజులుగా స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులు అందించిన సేవలను అభినందించారు. పోలీసు సిబ్బందితో పాటు వారు సైతం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలందించారని కొనియాడారు. పోలీసు యంత్రాం, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ నిదర్శనం

సోదరి, సోదర భావానికి నిదర్శనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల మధ్య అనుబంధాన్ని చెప్పవచ్చని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం రక్షాబంధన్ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఒకరికొకరు అభినందనలు చెప్పుకుంటూ, రక్షాబంధన్ రిబ్బన్‌ను కట్టుకున్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

పుత్తూరు టౌన్, ఆగస్టు 19: పేదల విద్యాభివృద్ధికి దాతల సాయం తోడ్పాటుగా ఉంటుందని టీడీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముఖరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కట్టకింద రామకృష్ణాపురంలోని ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు, వెంకటేశ్వర కమ్యూనికేషన్ నెట్ వర్క్ అధినేత రజనీకాంత్ నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల సేవలో ఆత్మసంతృప్తి ఉంటుందని అన్నారు. షణ్ముఖరెడ్డి చేతుల మీదుగా పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గుణవతి, విద్యాకమిటీ ఛైర్మన్ మరి, వైస్ ఛైర్మన్ విజయలక్ష్మి, నాయకులు సంతోష్, చొక్కలింగంరెడ్డి, నారాయణ, మహేష్, కైలాసం, మణి, రత్నం, వేలురెడ్డి, లక్ష్మి, గోమతి పాల్గొన్నారు.


పుస్తకాలు అందజేస్తున్న రజనీకాంత్

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి, ఆగస్టు 19: పట్టణంలోని వీవీరోడ్డులో వెలసిన అంకాళమ్మ ఆలయం వద్ద సోమవారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సెల్‌సింగ్, సోహన్ రాబర, బాలాజీరావు, యశ్వంత్‌రావు, జయగణేష్ పాల్గొన్నారు.

టీడీపీ నేతకు పరామర్శ

శ్రీకాళహస్తి, ఆగస్టు 19: టీడీపీ సీనియర్ నేత కె.రామచంద్రయ్య పట్టణంలోని తన నివాసం వద్ద ఇటీవల జారిపడిపోయారు. చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని తన నివాసానికి చేరుకోగా, సోమవారం ఆయనను టీడీపీ నాయకులు కలిసి పరామర్శించారు. నాయకులు గుర్రప్పశెట్టి, డీవీ నారాయణ, సుబ్బయ్య, అశ్వత్థామ, సిద్ధులయ్య రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందజేత



శ్రీకాళహస్తి, ఆగస్టు 19: పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో ఉన్న సరస్వతీబాయి పురపాలకసంఘ ఉన్నత పాఠశాలను ఇటవల ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు తమ పాఠశాలలో నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించారని తెలపగా, ఆయన వారికి నగదు బహుమతి అందజేస్తానని మాట ఇచ్చారు. ఈ మేరకు సోమవారం టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ ద్వారా ఆ విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. అందులో కె.లక్ష్మీప్రియకు రూ.20వేలు, సి.నవ్య, డి.జస్మిక, చేతన్‌సాయికి రూ.10వేలు వంతున అందజేశారు. ఎంఈవో బాలయ్య, ప్రధానోపాధ్యాయురాలు బృందాదేవి, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ వైస్ ఛైర్మన్ సుధారాణి, నాయకులు నెమళ్ళూరు సుబ్రహ్మణ్యం, సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధిలో ప్రజలను భాగస్వాములు చేయాలి

ఏర్పేడు, ఆగస్టు 19: గ్రామీణ అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య అన్నారు. రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పేడు మండల పరిధిలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడ్రోజుల పాటు శిక్షణ కార్యక్రమం సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభమైంది. ఎంపీడీవో గిడ్డయ్య, ఈవోపీఆర్డీ రమణకుమార్, ప్రసాద్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.